నేటి దినపత్రిక
# సూర్య
18వ వసంతంలోకి
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు
శుక్రవారం | 18 ఏప్రిల్ 2025 | పేజీలు 8

## నూతన వక్ఫ్ చట్టం రద్దు కోరుతూ.. భారీ ర్యాలీ

మండల కేంద్రం ఏఎస్ పేటలో గురువారం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2025 నూతన వక్ఫ్ చట్టాన్ని రద్దు చేయాలంటూ ముస్లిం మత పెద్దలు నిరసన ర్యాలీ చేపట్టారు.




లోపల పేజీలో

## జిల్లా జడ్జిని కలిసిన కలెక్టర్



నెల్లూరు లీగల్, మేజర్‌న్యూస్ : నెల్లూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా పదవి బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్‌ను జిల్లా కలెక్టర్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా కోర్టులోని జిల్లా జడ్జి చాంబర్లో ప్రధాన న్యాయమూర్తిని కలిసిన జిల్లా కలెక్టర్ ఆయనకు పూలబొకే ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్‌కు జిల్లా ప్రధాన న్యాయమూర్తి కృతజ్ఞతలు తెలిపారు.

### ఘనంగా ఎంపీ వేమిరెడ్డి
## ముందస్తు జన్మదిన వేడుకలు

**అనాథాశ్రమాలకు నిత్యావసర సరకుల పంపిణీ**



2లో



## రైతు ప్రయోజనాలే లక్ష్యంగా..

**జిల్లాలో రబీకి 3 లక్షల ఎకరాలకుపైగా సాగునీరు**

- 41 టీఎంసీలు నీటిని కేటాయిస్తూ సాగునీటి సలహా మండలి తీర్మానం
- మే 5 నుంచి నీటి విడుదల
- భవిష్యత్తు అవసరాల దృష్ట్యా నీటిని పొదుపుగా వాడుకోవాలి
- సాగునీటి కేటాయింపుల్లో నీటి సంఘం అధ్యక్షులు కీలక పాత్ర పోషించాలి
- లష్కర్ల జీతాల బకాయిల చెల్లింపునకు కృషి చేస్తాం
- జిల్లాలో మేజర్ ఇరిగేషన్ పనులకు రూ. 18 కోట్లు
- ఉపాధి హామీ ద్వారా మైనర్ ఇరిగేషన్ పనులు చేపడుతాం
- ఇరిగేషన్ అధికారులు బాధ్యతగా పనిచేయాలి.. లేకుంటే చర్యలు తప్పవు
- రైతులందరూ ఆరుతడి పంటల వైపు మొగ్గు చూపాలి
- రైతుల అవసరాలకు తగ్గట్లు నాలుగు లక్షల విత్తనాలు సిద్ధం
- జిల్లాలో చివరి ఎకరా వరకు సాగునీరు అందించడమే ప్రధాన లక్ష్యం
- మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి

నెల్లూరు టౌన్/కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :

రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా జిల్లాలో రెండో పంట రబీకి సంబంధించి 3లక్షల పైగా ఎకరాలకు 41 టిఎంసిల నీటిని కేటాయిస్తూ సాగునీటి సలహామండలిలో తీర్మానించినట్లు రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి వెల్లడించారు. గురువారం ఉదయం నగరంలోని జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో జిల్లా సాగునీటి సలహామండలి సమావేశం జిల్లా కలెక్టర్ ఆనంద్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్ చక్రవర్తి, సర్వేపల్లి, నెల్లూరు రూరల్, కోవూరు, ఉదయగిరి, కావలి ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, కాకర్ల సురేష్, దగుమాటి వెంకటకృష్ణారెడ్డి, ప్రాజెక్టు, డిస్ట్రిబ్యూటరీ, నీటి సంఘాల అధ్యక్షులు, రైతు సంఘాల నాయకులు, అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సోమశిల, కండలేరు జలాశయాల్లో ప్రస్తుత నీటి నిల్వలు, ఎంతమేర రబీ పంటకు నీటిని కేటాయించాలి.. చెన్నై, తిరుపతికి తెలుగు గంగ ద్వారా నీటి కేటాయింపులు, సాగునీటి కాలువల నిర్వహణ, పూడికతీత, గుర్రపుడెక్క తొలగింపు, లష్కర్లకు జీతాల బకాయిల చెల్లింపు

-మిగతా 3లో



### ఇంజనీరింగ్ అధికారుల తీరుపై సభ్యులు
## అసహనం

నెల్లూరు టౌన్, మేజర్‌న్యూస్ :

పంచాయతీరాజ్ శాఖలో పనులు చేసిన సకాలంలో అధికారులు బిల్లులు చేయకపోవడంపై జడ్పిటిసి సభ్యులు అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. గురువారం నూతన జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షతన జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో కావలి, జంపాని రాఘవులు, మర్రిపాడు సుధాకర్ రెడ్డిలు మాట్లాడారు. 1వ స్థాయి సంఘమైన ప్రణాళిక, ఆర్థిక విషయాలకు సంబంధించి పంచాయతీరాజ్ శాఖపై జరిగిన సమీక్షలో పంచాయతీరాజ్ శాఖ ఎస్ఈ అశోక్ కుమార్.. ఆ శాఖకు సంబంధించి జరుగుతున్న పనులు, జరిగిన పనులు, వివిధ దశల్లో ఉన్న పనులు వాటి చెల్లించిన నిధులకు సంబంధించి సమావేశంలో మాట్లాడారు. దీంతో కావలి జడ్పిటిసి సభ్యుడు రాఘవులు తమ ప్రాంతంలో జరిగిన పనులకు బిల్లులు చేయలేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఆ పనులపై క్వాలిటీ కంట్రోల్ అధికారులు ఇంతవరకు పరిశీలించలేదని, దీంతో ఎం-బుక్కులు చేయలేదని, వీటి వల్ల తాము ఇబ్బందులు పడుతున్నట్లు సమావేశంలో తెలిపారు. క్వాలిటీ కంట్రోల్ అధికారులు అందుబాటులో లేరని వారి నుంచి సరైన సమాధానం కూడా తమకందడం లేదని అసంతృప్తి

-మిగతా 2లో

## యథేచ్ఛగా క్వార్జ్ దోపిడీ

**మాజీ జడ్పీ వైస్ చైర్మన్ శిరీష ఆరోపణ**

నెల్లూరు, మేజర్‌న్యూస్ :



సైదాపురం మండలంలో అన్ని అనుమతుల లీజు ఉన్న క్వార్జ్ గనులను మూసేఇంచి లీజు గడువు ముగిసిన వాటికి స్టాక్ పాయింట్ నుంచి తరలించడానికి అనుమతులు ఇచ్చారని, గనులను వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి తన చెప్పు చేతుల్లోకి తీసుకునేందుకు ప్రయత్నమని రాష్ట్ర సంగీత అకాడమీ మాజీ చైర్మన్ పొట్టేళ్ల శిరీష తెలిపారు. గురువారం నెల్లూరు జిల్లా జర్నలిస్ట్ భవన్లో ఆమె విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా

-మిగతా 2లో

# సోషల్ మీడియా మాయలో పడి చదువులు పాడు చేసుకోవద్దు

- విద్యార్థులలో నైతికత పెంపొందించే దిశగా విద్యా బోధన సాగాలి
- పిల్లలతో గడిపేందుకు తల్లి తండ్రులు సమయం కేటాయించాలి
- ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** పరీక్షలలో ఫెయిల్ అయినంత మాత్రాన నిరుత్సాహ పడాల్సిన అవసరం లేదని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి విద్యార్థులకు హితోపదేశం చేశారు. కొడవలూరు మండలం రాజుపాళెంలోని శ్రీవెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల వార్షికోత్సవంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ.. సోషల్ మీడియా లాంటి మాడ్రన్ టెక్నాలజీ పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అధ్యాపకులతో పాటు తల్లిదండ్రులు సైతం పిల్లల మానసిక స్థితి హావ భావాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాల న్నారు. పిల్లలతో గడిపేందుకు తల్లిదండ్రులు సమయం కేటాయించాలని కోరారు. విద్యార్థుల లో నైతికత పెంపొందించే దిశగా విద్యా బోధన చేయాలని అధ్యాపకులకు సూచించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను గౌరవిస్తూ చదువుల్లో రాణించి ఉన్నత జీవితంలో ఉన్నత స్థాయికి ఎదిగేందుకు కృషి చేయాలన్నారు.

కార్యక్రమంలో శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల ఛైర్మెన్ గుణశేఖర్, ప్రఖ్యాత నేపధ్య గాయని సునీత, కొడవలూరు జెడ్పిటిసి పసుపులేటి సరోజనమ్మ, టిడిపి నాయకులు బెజవాడ వంశీకృష్ణారెడ్డి, అడపాల శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రూరల్ నియోజకవర్గంలో 5 ఏసీ బస్ షెల్టర్లు ప్రారంభోత్సవం



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ నియోజకవర్గం పరిధిలోని ఐదు బస్సు షెల్టర్లు ప్రారంభోత్సవ కార్యక్రమంలో టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, మాజీ మేయర్ నంది మండలం భానుశ్రీ, నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ నందన్ పాల్గొన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి మాట్లాడుతూ.. నెల్లూరు రూరల్ నియోజకవర్గం పరిధిలో 5 ఏసీ బస్ షెల్టర్లు ప్రారంభించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. అదేవిధంగా ఈ వేసవికాలంలో వయో వృద్ధుల, పిల్లల, గర్భిణీ స్త్రీల, మహిళల, సౌకర్యార్థం కోసమే ఈ ఏసీ బస్‌స్టాప్‌లు ప్రారంభించామన్నారు. అలాగే గత వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం వీటిని వినియోగంలోకి తీసుకు రాకపోగా, వీటిని గాలికొదిలేసి, నిరుపయోగంగా ఉన్న ఏసీ బస్సు షెల్టర్లను కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే మంత్రి నారాయణ సహకారంతో వీటిని మళ్లీ పునఃప్రారంభించామన్నారు. ప్రజాధనం దుర్వినియోగం కాకుండా మళ్లీ ప్రజలకు అందుబాటులోకి తెచ్చామన్నారు. వీటిని పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. అలాగే నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో ఇంత పెద్ద ఎత్తున అభివృద్ధి పనులకు సహకరిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, రాష్ట్ర మంత్రి నారా లోకేష్, మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణలకు, కలెక్టర్, కమిషనర్, అధికార యంత్రాంగానికి నెల్లూరు రూరల్ నియోజకవర్గ ప్రజల పక్షాన ధన్యవా దాలు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరే టర్లు, క్లస్టర్ ఇంచార్జీలు, తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## ఇద్దరు పంచాయతీ కార్యదర్శులు సస్పెన్షన్ : డీపీఓ శ్రీధర్‌రెడ్డి

**నెల్లూరు టౌన్, మేజర్‌న్యూస్ :** మనుబోలు మండలం వీరంపల్లి గ్రామ పంచాయతీ కార్య దర్శి తేదిలక్ష్మి, బోగోలు మండలం నాగులవరం గ్రామ పంచాయతీ కార్యదర్శి భాస్కరరావును గురువారం జిల్లా కలెక్టర్ సస్పెండ్ చేసినట్లు జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. పంచాయతీ కార్య దర్శి భాస్కరరావు విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించడం.. పంచాయతీ నిధులు 23,593 రూపాయలు దుర్వినియోగం చేసినట్లు పలు ఆరోపణలు రావడంతో విచారించి అతని సస్పెండ్ చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా పంచాయతీ కార్య దర్శి ఆదిలక్ష్మి విడలూరు మండలం ముదివర్తి గ్రామ పంచాయతీలో పనిచేసిన సమయంలో 1,09,650 నిధుల దుర్వినియోగం లో 54,280 రూపాయలు అభ్యంతరకరంగా ఖర్చు చేసినందు వల్ల విచారించి ఆమెను సస్పెండ్ చేయడం జరిగిందని జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్ రెడ్డి తెలిపారు.

# యదేచ్ఛగా క్వార్ట్జ దోపిడీ

(మొదటి పేజీ తరువాయి)

ఆమె మాట్లాడుతూ వేమిరెడ్డి అనుచరులు దౌర్జన్యం చేస్తున్నారని అన్నారు. గత పది నెలలుగా సైదాపురం మండలంలో అనుమతులు ఉన్న అన్ని గనులను మూసివేసి, లేని వాటికి తరలించేందుకు అనుమతులు ఇచ్చారన్నారు. వేలాదిమంది కార్మికులు కూలీలు పనిలేక రోడ్డును పడ్డారన్నారు. ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వ అనుమంతు చట్టబద్ధంగా వ్యాపారం చేస్తున్న వెంకటగిరి రాజాకు సంబంధించిన గనులు కళ్యాణ్ రామ్, జిన్పెక్స్ మైన్స్‌ను మూసి వేయించారన్నారు. 2010-12లో లీజు గడువు ముగిసి పర్యావరణ అనుమతులు లేని పద్మావతి మైన్స్, సిద్ధి వినాయక మైన్స్‌కు స్టాక్ పాయింట్లు ఇచ్చారన్నారు. మైన్స్ రూల్స్ ప్రకారం 50 సంవత్సరాలు ముగిశాక ఆక్షన్ పద్ధతిలో టెండర్లు పిలవాల్సి ఉండగా జిల్లా అధికారులు రూల్ పాటించకుండా అప్లికేషన్లు డిఎంజికి పంపారన్నారు. కానీ ఐఏఎస్ అధికారుల నిజాయితీ వల్ల అప్పట్లో తిరస్కరించారన్నారు. పద్మావతి మైన్స్‌పై 32 కోట్ల డిమాండ్ నోటీసు ఉందని తెలిపారు. 32 కోట్ల నోటీసు ఉన్న వీటికి స్టాక్ పాయింట్ల నుండి మెటీరియల్ను తరలించడానికి అధికారులు ఎలా అనుమతులు ఇచ్చారో తెలపాలనీ ప్రశ్నించారు. 32 కోట్ల ధనాన్ని ఎవరి దగ్గర నుండి వసూలు చేస్తారో డిడి బాలాజీ నాయక్ తెలపాలన్నారు. అప్పట్లో విజిలెన్స్ ఏడీగా ఉన్న బాలాజీ నాయక్, సూపర్వైజర్ సుధాకర్, రెవిన్యూ డిపార్ట్మెంట్ వాళ్లతో కలిసి పద్మావతి మైన్స్ లో గత మేలో 38 వేల టన్నుల మెటీరియల్ ఉందని పంచనామా నిర్వహించారు అన్నారు. ఈ ఫిబ్రవరిలో లక్షా 55 వేలటన్నుల స్టాక్ మెటీరియల్ ఉందని అంటున్నారని మూసివేసిన గనుల్లో ఇది ఎలా సాధ్యమని ప్రశ్నించారు. ఏడి హోదా నుండి డిడి హోదాకి జెట్ స్పీడ్‌లో వచ్చారని మెటీరియల్ కూడా అదే స్పీడ్‌లో ఉత్పత్తి అయి ఉంటుందని ఎద్దేవా చేశారు.. పద్మావతి మైన్స్ డైరెక్టర్ శోభారాణి ఈ జనవరి 20న స్టాక్ పాయింట్ తరలించాలని డిఎస్జీకి పర్మిషన్ పెట్టారన్నారు, 22వ తేదీన వారు రిజెక్ట్ చేశారన్నారు. కానీ విచిత్రంగా అదే డిఎంజి ఫిబ్రవరి 26న ఎలా పర్మిషన్ ఇచ్చిందో అర్థం కావడం లేదన్నారు. సైదాపురంలో వెంటనే అనుమతులు ఉన్న గనులను తెరిపించాలన్నారు లేనిపక్షంలో ప్రజల పక్షాన వైసిపి పోరాడుతుందని హెచ్చరించారు.

## ఘనంగా ఎంపీ వేమిరెడ్డి ముందస్తు జన్మదిన వేడుకలు



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ముందస్తు జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈనెల 19న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పుట్టినరోజు నేపథ్యంలో గురువారం సాయంత్రం టిడిపి నాయకులు డేవిన్ జాన్, అతడి అనుచరులు నెల్లూరు పరిధిలోని గీతామయి వృద్ధుల ఆశ్రమం, వియాని, విశ్వ భారతి అంధుల ఆశ్రమానికి 50 వేల విలువైన నిత్యావసర సరకులను ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి చేతుల మీదుగా వితరణ చేశారు. అనంతరం కేకు కట్ చేశారు. ఈ సందర్భంగా ప్రశాంతమ్మ మాట్లాడుతూ.. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా డేవిడ్ జాన్ ఇంత మంచి కార్యక్రమం చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. అందరికీ మంచి భవిష్యత్తు ఉంటుందని, ఇంత మంది యువత తమవెంట ఉండటం పట్ల హర్షం వ్యక్తం చేశారు. సొంత డబ్బులు పెట్టుకుని అనాధాశ్రమాలకు నిత్యావసర సరకులు అందించారని కొనియాడారు. ఈ సందర్భంగా యువతకు ఆమె ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో రాజేష్ రెడ్డి, మౌళి, శామ్యూల్, హరి, పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంజనీరింగ్ అధికారుల తీరుపై సభ్యులు అసహనం

(మొదటి పేజీ తరువాయి)

వ్యక్తం చేశారు. అదేవిధంగా మర్రిపాడు జడ్పిటిసి సభ్యులు సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ క్వాలిటీ కంట్రోల్ అధికారులు పరిశీలించి రిపోర్ట్ ఇవ్వకపోతే బిల్లులు పెట్టలేని పరిస్థితిని అన్నారు. ఇంజనీరింగ్ అధికారులు కూడా పూర్తిస్థాయిలో అందుబాటులో లేరని ఆయన తెలిపారు. వారి చుట్టూ తిరగలేని పరిస్థితి ఏర్పడిందని ఇక్కడికి వచ్చిన అధికారులు సక్రమంగా ఉండడం లేదన్నారు. దీంతో జడ్పీ చైర్పర్సన్ ఆనం అరుణమ్మ పంచాయతీ రాజ్ శాఖలో జరిగిన పనులపై ఆరా తీశారు. ఆ శాఖ పనితీరుపై చైర్‌పర్సన్ అసంతృప్తి వ్యక్తం చేశారు. పంచాయతీరాజ్ శాఖలో జరిగిన పనులు పూర్తయిన కొన్ని పనులకు అదనంగా ఎస్టిమేట్లు వేయడం ఏమిటని ఆమె ప్రశ్నించారు. పంచాయతీరాజ్ శాఖలో జరిగిన పనులపై క్వాలిటీ కంట్రోల్ పరిశీలించి రిపోర్ట్ ఇవ్వకపోతే బిల్లులు ఎలా పెట్టుకుంటారని ఆమె అన్నారు. బిల్లులు పెండింగ్ లేకుండా చూడాలని జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ ఎస్ఈ అశోక్ కుమార్‌కు సూచించారు. సమావేశంలో జడ్పీ సీఈఓ విద్య రమ, డిప్యూటీ సీఈఓ మోహన్ రావు, హౌసింగ్ పీడీ వేణుగోపాల్, కలువాయి జెడ్పిటిసి అనిల్ కుమార్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## జడ్పీ చైర్‌పర్సన్‌ను కలిసిన ఐసీడీఎస్ పీడీ



**నెల్లూరు టౌన్, మేజర్‌న్యూస్ :** జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో జిల్లా ప్రజా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మను నూతనంగా నియమ తులైన స్త్రీ, శిశు సంక్షేమ శాఖ పీడీ సువర్ణ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్‌కు పూలకుండీ ఇచ్చారు.

# రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా..



(మొదటి పేజీ తరువాయి)

మొదలైన అంశాలపై మంత్రి ఆనం, ఎమ్మెల్యేలు, జిల్లాలో నూతనంగా ఎన్నికైన నీటి సంఘాల అధ్యక్షులు ప్రధానంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ.. నూతనంగా ఎన్నికైన నీటిసంఘాల అధ్యక్షులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. సుమారు ఆరేళ్ల అనంతరం తమ ప్రభుత్వం నీటిసంఘాలకు అధ్యక్షులను, సభ్యులను నియమించినట్లు చెప్పారు. రైతులకు అన్నివిధాలా అండగా వుండాలనే ప్రధాన లక్ష్యంతోనే నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించినట్లు చెప్పారు. నీటి సంఘాల అధ్యక్షులందరూ సాగునీటి యాజమాన్యంలో కీలక భూమిక పోషించాలని మంత్రి పిలుపునిచ్చారు. రబీ పంట అవసరాల మేరకు ఏ ప్రాంతాల్లో నీరు ఎక్కువగా కావాలి, ఎక్కడ తక్కువగా కావాలో అంచనా వేసి ఎమ్మెల్యేలు, రైతుల సూచనల మేరకు నీటిని విడుదల చేసేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి స్పష్టం చేశారు. మే నెల 5వ తేదీ నుంచి సోమశిల జలాశయం నుంచి నీటిని పంట కాలువలకు విడుదల చేయనున్నట్లు మంత్రి పేర్కొన్నారు. జిల్లాలో ప్రస్తుతం సోమశిల జలాశయం పరిధిలో 52.653 టిఎంసీల నీటినిల్వ, కనిగిరి, సర్వేపల్లి రిజరాయర్లలో 3.615 టిఎంసిల నీటి నిల్వ కలిపి మొత్తం 56.268 టిఎంసిల నీటి నిల్వలో డెడ్ స్టోరేజి 7,500 టిఎంసిలు, నీటి ఆవిరి 1500 టిఎంసిలు, నెల్లూరు కార్పొరేషన్, కావలి, అల్లూరు, ఆత్మకూరు తదితర పట్టణాల తాగునీటి అవసరాలకు 3,500 టిఎంసిలు మొత్తం 12.500 టిఎంసిల నీరు మినహాయించగా 43.768 టిఎంసిల నీటి లభ్యత ఉన్నట్లు మంత్రి చెప్పారు. ఇందులో సుమారు 36 టిఎంసిల వరకు నీటిని పొదుపుగా రబీ పంట సాగునీటి అవసరా లకు వినియోగించుకుని 10టిఎంసిల నీటిని భవిష్యత్ అవసరాలు, రాబోయే ఖరీఫ్ పంట కోసం నీటిని నిల్వ చేసుకునేలా ప్రణాళికాబద్ధంగా నీటిని వాడుకునేందుకు అందరూ సహకరించాలని మంత్రి కోరారు. ఈ నీటి లభ్యత ఆధారంగా పెన్నా డెల్టా ఆయకట్టుకు 2లక్షల ఎకరములకు, కనుపూరు కాలువ 25వేల ఎకరాలు, సోమశిల ప్రాజెక్టు కాలువ కింద 1.44లక్షల ఎకరాలు మొత్తం 3.69 లక్షల ఎకరాల ఆయకట్టుకు 43.42 టిఎంసిల నీటి కేటాయింపును అధికారులు ప్రతిపాదించగా, ఐఎబీ సమావేశంలో ఎమ్మెల్యేలు, నీటి సంఘాల అధ్యక్షులు అందరి ఆమో దం మేరకు రెండో పంట రబీకి సుమారు 3లక్షల పైగా ఎకరాలకు 41 టిఎంసిల నీటిని కేటాయించాలని తీర్మానించినట్లు చెప్పారు. ఈ మూడునెలలు ఇరిగేషన్ అధికారులు నీటిసంఘాల అధ్యక్షులతో కలిసి రైతులకు సక్రమంగా నీటిని అందించాలని, ఎక్కడైనా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించినా, అక్రమాలకు పాల్పడినా ఎవరినీ ఉపేక్షించే ప్రసక్తే లేదని మంత్రి హెచ్చరించారు. మనమంతా కూడా రైతులకు నీరు అందించడమే ప్రధాన లక్ష్యంగా పని చేయాలని పిలుపునిచ్చారు. జిల్లాలో మేజర్, మైనర్ ఇరిగేషన్ పనులకు ప్రభుత్వం 18 కోట్లను ప్రభుత్వం విడుదల చేసిందన్న మంత్రి ఆనం, ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, నీటిసంఘాల అధ్యక్షుల సలహాల మేరకు ప్రాధాన్యతాక్రమంగా పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. మైనర్ ఇరిగేషన్ కాలువల పూడిక తీత, గుర్రపుడెక్క తొలగింపు పనులను ఉపాధిహామీ పథకం ద్వారా చేపట్టనున్నట్లు మంత్రి చెప్పారు. ఎంపిడివోలు, డ్వామా సిబ్బంది, ఇరిగేషన్, నీటిసంఘాల అధ్యక్షుల సమన్వయంతో ఈ పనులు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. జిల్లాలో సాగునీటి కాలువ పరిధిలో రైతులు రూ.38కోట్ల నీటిపన్ను బకాయిలు చెల్లించాలని మంత్రి ఆనం చెప్పారు. ఈ పన్ను బకాయిలు వసూలైతే ఆ నిధులను జిల్లాలో కాలువల మెయింటెనెన్స్‌కు మనమే వినియోగించుకోవచ్చన్నారు. ఈ పన్నుల వసూలుకు నీటి సంఘాల అధ్యక్షులు సహకారం అందించాలన్నారు. రైతులందరూ తక్కువ నీటితో పండే ఆరుతడి పంటలు వేసేలా వ్యవసాయాధికారులు ఈనెల 21 నుంచి 30 వరకు ముమ్మరంగా అవగాహన సదస్సులు నిర్వహించాలని ఆదేశించారు. అన్ని రకాల విత్తనాలను సిద్ధంగా చేసుకోవాలని, ఎక్కడైనా విత్తనాల కొరత ఉంటే ముందగా జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి అవసరమైన విత్తనాలు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. 4 లక్షల ఎకరాలకు తక్కువ కాకుండా ధాన్యం విత్తనాలను సిద్ధం చేసుకోవాలన్నారు. లష్కర్ల జీతాల బకాయి ల చెల్లింపు విషయమై నీటిపారుదలశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారిస్తామని మంత్రి చెప్పారు. జిల్లాలో సుమారు 4.68 కోట్ల బకాయిలు లష్కర్లకు చెల్లించాల్సి వుందని, ఇవన్నీ గత ప్రభుత్వ బకాయిలన్నారు. ఏదేమైనా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి లష్కర్లకు జీతాలు చెల్లించడం తమ బాధ్య తగా మంత్రి చెప్పారు. శాసనసభ్యులు తమ దృష్టికి తీసుకొచ్చిన సమస్యల పరిష్కా రానికి ప్రాధాన్యత ఇస్తూ పరిష్కారానికి కృషి చేస్తామని మంత్రి చెప్పారు. జిల్లాలో ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి 191 కోట్ల రూపాయల విలువైన 1.09 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభు త్వం రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసినట్లు మంత్రి చెప్పారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ధాన్యం విక్రయించిన 24 నుంచి 48 గంటల్లోనే రైతుల ఖాతాలకు నగదు జమచేశామని, రైతుల పట్ల తమ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి ఇది ఒక నిదర్శనంగా మంత్రి ఆనం చెప్పారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి, కూటమి ప్రభుత్వానికి మంత్రి ప్రత్యేక ధన్యవాదాలు చెప్పారు. గత రెండు రోజుల క్రితం సర్వేపల్లి నియోజకవర్గంలో కురిసిన వర్షాలు, ఈదురుగాలులకు దెబ్బతిన్న పంట నష్టాన్ని అంచనా వేసి నివేదికను అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ నివేదిక ఆధారంగా రైతులను ప్రభుత్వపరంగా ఆదుకుంటామని మంత్రి చెప్పారు. సమావేశంలో సోమశిల, పెన్నాడెల్టా, కందుకూరు కెనాల్ ప్రాజెక్టు కమిటీల చైర్మన్లు కేశవ చౌదరి, రాజగోపాల్, మస్తానయ్య, కందుకూరు సబ్‌కలెక్టర్ శ్రీపూజ, ఆత్మకూరు ఆర్డీవో పావని, ఇరిగేషన్, సోమశిల, తెలుగు గంగ ఎస్‌ఈలు దేశ్‌నాయక్, వెంకట రమణారెడ్డి, రాధాకృష్ణారెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి, ఉద్యానవన శాఖ అధికారి సుబ్బారెడ్డి, ఎపిఎంఐపి పిడి శ్రీనివాసులు, సోమశిల ఈఈ మల్లికార్జున, సోమశిల, తెలుగుగంగ, ఇరిగేషన్ ఇంజనీరింగ్ అధికారులు, రైతుసంఘాల నాయకులు పాల్గొన్నారు.

## ఉదయగిరిని ప్రత్యేకంగా చూడాలి : ఎమ్మెల్యే కాకర్ల సురేష్

మెట్ట ప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గాన్ని ప్రత్యేకంగా చూడాలని ఎమ్మెల్యే సురేష్ మంత్రి ఆనంను కోరారు. డిస్ట్రిబ్యూటరీ ఛానల్స్‌ను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయాలన్నారు. కాకుటూరు, కొండాపురం, గండిపాలెం ప్రాజెక్టులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. తన నియోజకవర్గంలో 149 నీటి సంఘాలున్నాయని, 8 మండలాలుండగా కేవలం 2 మండలాలకే సోమశిల జలాలు అందుతాయని, మిగిలిన 6 మండలాలు పూర్తిగా వర్షంపైనే ఆధారపడినట్లు ఎమ్మెల్యే సురేష్ వివరించారు. ఉదయగిరిని ప్రత్యేకంగా పరిగణించి నీటిని కేటాయించాలని, కాలవల పనులు చేపట్టాలన్నారు. గండిపాలెం ప్రాజెక్టు నిర్వహణపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని కోరారు.

## స్వర్ణముఖికి 3 టిఎంసిలు కేటాయించాలి :

### ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్‌చక్రవర్తి

తిరుపతి జిల్లా గూడూరు, సూళ్లూరుపేట, తిరుపతి పట్టణాలకు నీటిని 4.75 టిఎంసిలు కేటాయించడం చాలా సంతోషంగా ఉందని, ఇందుకు మంత్రి ఆనంకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్‌చక్రవర్తి చెప్పారు. కోట, వాకాడు, చిట్టమూరు, నాయుడుపేట మండలాల ప్రధాన నీటివనరు అయిన స్వర్ణముఖి కింద 48చెరువులకు ఒకటిన్నర టీఎంసీ, తాగునీటి అవసరాలకు 0.75 టీఎంసీలు కేటాయించినట్లు చెప్పారు. దీనిని 3 టీఎంసీలకు పెంచాలని కల్యాణ్ చక్రవర్తిని మంత్రిని కోరారు.

## చివరి ఆయకట్టు వరకు నీరందించాలి :

### ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి



కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ జిల్లాలోనే అతిపెద్ద డెల్టా ప్రాంతం కోవూరు అని, 1.93 లక్షల మెట్రిక్ టన్నులతో కోవూరు నియోజకవర్గ రైతులు 500కోట్ల టర్నోవర్ సాధించినట్లు చెప్పారు. సకాలంలో వర్షాలు పడడం, ధాన్యం కొనుగోళ్లలో అధికారుల సహాయ సహకారాలతో రైతులు సుభిక్షంగా ఉన్నారన్నారు. కనిగిరి, జాఫర్ సాహెబ్ కాలువల్లో పూడికతీత పనులు చేయాలని కోరారు. చివరి ఆయకట్టు వరకు నీరు అందించడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని, ఇదే తమ లక్ష్యంగా ఆమె చెప్పారు. అలాగే లష్కర్లకు జీతాలు చెల్లించేందుకు కృషి చేయాలని మంత్రి ఆనంను ప్రశాంతిరెడ్డి కోరారు.

## డిఆర్ ఛానల్ పనులు చేపట్టాలి : ఎమ్మెల్యే కృష్ణారెడ్డి



ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారం చేపట్టిన తరువాత సకాలంలో వర్షాలు పడి అన్నదాతలు సంతోషంగా వున్నారన్నారు. కావలి కాలువ, దగదర్తి డిఆర్ ఛానల్ పనులు త్వరగా పూర్తి చేయాలని కోరారు. డిఆర్ ఛానల్ పరిధిలో 70వేల ఎకరాలకు నీరందించాల్సి ఉందన్నారు. సాగునీరు వదిలేందుకు ముందుగానే కాలువల అభివృద్ధి పనులు పూర్తి చేయాలని ఆయన కోరారు. మే 10లోగా నీరు విడుదల చేయాలన్నారు.

## నీటి సంఘాల అధ్యక్షులు కీలకంగా పనిచేయాలి :

### ఎమెల్యే సోమిరెడ్డి



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సోమశిల, కండలేరు జలాశయాల్లో 100 టిఎంసీల నీటి నిల్వలు గల ఏకైక జిల్లా నెల్లూరుజిల్లా మాత్రమే నని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి అన్నారు. సాగునీటి నిర్వహణలో నీటి సంఘాల అధ్యక్షులు కీలకంగా పని చేయాలన్నారు. నీరు వృథా కాకుండా అవసరం మేరకు పొదుపుగా వాడు కోవాలని సూచించారు. సర్వేపల్లి నియోజకవర్గంలో సర్వేపల్లి, కృష్ణపట్నం కాలువల కింద చాలామంది రైతులు రెండో పంట వేయలేదన్నారు. పంటలు వేసిన రైతులకు మాత్రం ఇబ్బందులు లేకుం డా నీటిని విడుదల చేయాలన్నారు. ప్రధాన కాలువల్లో పనులకు నిధులు మంజూరు కాగా, చిన్నకాలు వల్లో ఉపాధిహామీ ద్వారా పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వంలో పనులు చేయకుండానే బిల్లులు స్వాహా చేశారని మండిపడ్డారు. ఒక్క సర్వేపల్లి నియోజకవర్గం లోనే 150 కోట్లు కాజేశారని ఆరోపించారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి బాగోలేదని, ప్రభుత్వం మంజూరు చేసిన ప్రతిరూపాయిను కూడా వృథాకాకుండా పనులు చేయాలన్నారు.

# నెల్లూరు జిల్లా వ్యాప్తంగా పోషణ్ పక్వాడ కార్యక్రమాలు




**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్, ఫీల్డ్ ఆఫీస్, నెల్లూరు మరియు ఐసిడిఎస్ ప్రాజెక్ట్, నెల్లూరు వారి సంయుక్త ఆధ్వర్యంలో నెల్లూరు రూరల్ నియోజకవర్గం పరిధిలో కల్లూరు పల్లి హౌసింగ్ బోర్డు ఇందిరమ్మ కాలనీలో గల అంగన్వాడి సెంటర్ నందు పోషణ్ పక్వాడపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సిడిపిఓ కే.లక్ష్మీదేవి మాట్లాడుతూ... పోషణ్ అభియాన్ శిశువు జీవితం లోని మొదటి 1000 రోజుల పౌష్టికాహారం యొక్క ప్రాముఖ్యతను, పోషణ్ ట్రాకర్ యొక్క ఉపయోగాన్ని తెలియజేశారు. అదేవిధంగా క్షేత్ర ప్రచార సహాయకులు పి.హరికృష్ణ మాట్లాడుతూ.. పోషణ్ పక్వాడ 2025 యొక్క ముఖ్య ఉద్దేశం మహిళలు, పిల్లలపై ప్రధానంగా దృష్టి సారించి పోషకాహార భారత్‌ను నిర్మించే దిశగా ఒక అడుగు ముందుకు వేయడం అని అన్నారు. వికసిత్ భారత్ సంకల్పంలో భాగంగా ఆరోగ్యవంతమైన భారతదేశాన్ని నిర్మించడం కోసం కేంద్ర ప్రభుత్వం పౌష్టికాహారాన్ని అందించడంలో ముఖ్య భూమిక పోషిస్తుందని తెలిపారు. అలాగే పోషణ పక్వాడాలో భాగంగా పౌష్టికాహార ప్రదర్శన, గర్భవతులకు సీమంతాలు, పౌష్టికాహార కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్లు, టీచర్లు, మహిళలు పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం




**జిల్లా అడిషనల్ డివిజన్ ప్రాజెక్ట్ మేనేజర్ జి.మునిరత్నం**

**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు అడిషనల్ డివిజన్ ప్రాజెక్ట్ మేనేజర్ జి.మునిరత్నం అన్నారు. గురువారం మండల కేంద్రం సంఘమిత్ర కార్యాలయంలో రైతు సాధికార సంస్థ ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ కన్వర్జన్స్ అనే కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. అవగాహన కార్యక్రమానికి విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్లు, గ్రామ సచివాలయాల వ్యవసాయ శాఖ సహాయతో పాటు ఇంటిగ్రేటెడ్ కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్స్ రావడం జరిగింది. ప్రకృతి వ్యవసాయం గురించి అడిషనల్ ప్రాజెక్ట్ మేనేజర్ మాట్లాడారు. గత సంవత్సరం 960 ఎకరాలు లక్ష్మీదేవి పెట్టుకొని 150 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేసినట్లు తెలియజేశారు. దీనికి సంబంధించి రైతు సాధికార సంస్థ యూనిట్ ఇన్చార్జిలను, ఎంటిలను నియామకం చేసి ఉందని మొదట వీరందరూ ప్రకృతి వ్యవసాయం చేసి మిగతా వాళ్ళని ప్రోత్సహిస్తూ ప్రకృతి వ్యవసాయం చేయించాలని ఆయన పేర్కొన్నారు. అదే విధంగా మండల సమాఖ్య ద్వారా నవధాన్యాలు ఇస్తామని వాటిని దుక్కిలో దున్ని తదుపరి వ్యవసాయం చేస్తే అధిక దిగుబడులు వస్తాయని అన్నారు. ఎటువంటి రసాయనిక మందులు వాడకుండా వ్యవసాయం చేసే అవకాశం ఉందన్నారు. కషాయం, ద్రావణాలు వాడుకుంటూ తెగుళ్లు నివారణ చేసుకోవచ్చని తెలియజేశారు. మండలంలో ఏడు గ్రామాలను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ నందు ఈ సంవత్సరం ప్రకృతి వ్యవసాయం మరింతగా ఎక్కువ చేస్తామని అడిషనల్ డివిజన్ ప్రాజెక్ట్ మేనేజర్ తెలియజేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ ఏవో జోత్స్న రాణి, ఏపిఎం నిర్మల, యూనిట్ ఇన్‌చార్జ్‌లు శ్రీవాణి, శివ, యంటి దశయ్య తదితరులు పాల్గొన్నారు.

# అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని వింజమూరు అగ్నిమాపక కేంద్రాధికారి ఎం.చంద్రమౌళి తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా నాలుగవ రోజు స్థానిక నారాయణ పాఠశాల నందు కార్యక్రమం నిర్వహించారు. బహుళ అంతస్తుల్లో అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ఎలా జాగ్రత్తలు తీసుకోవాలో ప్రత్యక్షంగా డేమో ద్వారా చేసి చూపించారు. అలాగే ఇరుకు గదుల్లో అగ్నిప్రమాదాలు జరిగి స్పృహ కోల్పోయినప్పుడు ఏ విధంగా రక్షించాలో ప్రత్యక్షంగా తెలియజేశారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ గ్యాస్ లీకేజీ తదితరాలుగా ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలను గూర్చి వివరించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది మాధవ పి.రమేష్, ఎం.తిరుపతి, మహేంద్ర, పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు తదితరులు ఉన్నారు.

# రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి




**బోగోలు, మేజర్‌న్యూస్ :** బోగోలులో రెవరెండ్ డాక్టర్ జి.సాంసంగ్ బాబు చర్చిలో గురువారం విలేకరుల సమావేశ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 19వ తేదీ శనివారం ఉదయం 5 గంటలకు ఆరాధన టీవీ ఛానల్ వారి ఆధ్వర్యంలో రన్ ఫర్ జీసస్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి బోగోలు మండలంలోనీ 16 పంచాయతీలలోనీ చర్చిల నుండి భారీ సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సహకరించి విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో రెవ డాక్టర్ జి.శంసన్‌బాబు, రెవ సిహెచ్.నాగరాజు, రెవ.ఎబినేజర్, రెవ.ఎ.స్తెఫన్, రెవ.బి.రవికుమార్, రెవ.జి.రమేష్, రెవ.పి.శాంసన్ పెద్దలు పాల్గొన్నారు.

# పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యం



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మండలంలోని అంగన్వాడి కేంద్రాల పరిధిలోని గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారానే సంపూర్ణ ఆరోగ్య వంతులుగా ఉండడం సాధ్యమవుతుందని ఉదయగిరి అంగన్వాడి సిడిపిఓ సునీత అన్నారు. ఆమె గురువారం మండలంలోని గుడి నరవ అంగన్వాడి కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తక్కువ ఖర్చుతో దొరికే ఆకుకూరలు, చిరుధాన్యాలలో ప్రోటీన్లు, కొవ్వు పదార్థాలు, విటమిన్లు ఎక్కువ శాతం ఉంటాయన్నారు. అంగన్వాడి కేంద్రాల లబ్ధిదారుల సంపూర్ణ ఆరోగ్య మే లక్ష్యంగా పోషణ్ పక్వాడ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. గర్భిణీలు బాలింతలు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వీరిని ఆరోగ్య అంగన్వాడి కార్యకర్తలు పర్యవేక్షిస్తుండాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ తేజస్విని, ఆరోగ్య కార్యకర్త విజయ్ కుమారి, అంగన్వాడి కార్యకర్తలు మహాలక్ష్మి, మమత, ధనలక్ష్మి, పద్మ, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

# అగ్ని మాపక సిబ్బంది అవగాహన



**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** పట్టణంలోని గేట్ సెంటర్ ప్రవేట్ విద్యాసంస్థ వద్ద అగ్నిమాపక వారోత్సవాలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక అధికారి టి.విజయ వర కుమార్ అగ్ని ప్రమాదాలు జరిగితే ఎలా స్పందించాలన్న అంశంపై డెమో చూపించారు. ఇంట్లో వంట గ్యాస్ సిలిండర్ లీక్ అయినప్పుడు మంటలు ఎలా ఆర్పాలి అన్న వాటిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

# నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరు పట్టణంలో టౌన్ వన్ ఫీడర్ కింద బంగ్లా సెంటర్ నుండి షఫీ హాస్పిటల్ వరకు శుక్రవారం ఉదయం8 గంటలు నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ట్రాన్స్కో ఏఈ ఎస్‌కే నాగూరు వలి తెలిపారు. బైపాస్ రోడ్డు నిర్మాణ పనులలో భాగంగా విద్యుత్ స్తంభాలు మార్పు నూతన లైన్ల లాగటం వలన విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఉంటుందని కావున వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

**ఎన్ఎంయు అసోసియేషన్ ఆధ్వర్యంలో..**

# కార్మికుల ప్లే కార్డుల ప్రదర్శన




**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట గురువారం ఎన్ఎంయు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ప్లే కార్డులతో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా డిపో కార్యదర్శి కాశీ విశ్వనాథ్ మాట్లాడుతూ.. 1/19 సర్క్యులర్ అమలు చేయాలని, సిక్ చేసిన కార్మికుల జీతాలు ఇవ్వాలని, అక్రమ పనిష్మెంట్‌లు ఆపాలని, మహిళలకు పిల్లల సంరక్చన సెలవులు ఇవ్వాలని, గ్యారేజ్ సమస్యలు పరిష్కరించాలన్నారు. ఆన్ కాల్ డ్రైవర్ల జీతాలు పెంచాలని పెండింగ్ ఓ.టి డబ్బులు చెల్లించాలని, పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలోజోనల్ నాయకులు సలాం, జిల్లా నాయకులు మునిరత్నం డిపో నాయకులు విజయ్ కుమార్, శంకర్, శివకుమార్ మునీర్, రాజా, కిరణ్ బాబు, రమణయ్య, గౌస్ బాషా, సి.హెచ్. రమణయ్య, నదీమ్, మాలకొండారెడ్డి, కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు. గ్యారేజ్ నాయకులు రమణారెడ్డి, ఏడు కొండలు, ముజాఫర్, జలీల్, వెంకటేశ్వర్లు, గౌరవ సలహాదారుడు మౌలాలి, రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు బండి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## సంపూర్ణ ఆరోగ్యం పోషణ్ పక్వాడ లక్ష్యం : సూపర్వైజర్ షకీలా



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** చిన్నారులు గర్భిణీలు బాలింతలు కిషోర్ బాలికలలో పోషక ఆహార లోపాన్ని అధిగమించి వారిని సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దేందుకు పోషణ పక్వాడతో ఎంతో ఉపయోగపడుతుందని ఐసిడిఎస్ సూపర్వైజర్ షకీలా పేర్కొన్నారు. గురువారం మండలంలోని చాకలకొండ గ్రామంలో మెయిన్ అంగన్వాడి కేంద్రంలో పోషన్ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సూపర్వైజర్ షకీలా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పోషకాహార లోప నివారణ అవగాహనలో భాగంగా ఆకలి పరీక్ష నిర్వహణ మరియు సీఎంఏఎం పై వివరించారు. ముందుగా ఆరోగ్య పరిశీలన కార్యక్రమాన్ని నిర్వహించారు. గర్భిణీలు చిన్నారుల బరువు తనిఖీ చేయడం రెండేళ్ల కన్నా తక్కువ వయసుగల చిన్నారుల పెరుగుదల పరిశీలించడం చేపట్టారు. ఒకటి లేదా అంతకంటే ఎక్కువ పోషక పదార్థాలు లోపించిన ఆహారాన్ని తీసుకోవడాన్ని పోషకాహార లోపం అని ఆమె అన్నారు. అనారోగ్య పరిస్థితులు ఉపవాసాలు చేయడం పేదరికం మూఢనమ్మకాలు అవగాహన రాహిత్యం సాంఘిక ఆర్థిక కారణాలు అపరిశుభ్రత పోషకాహార లోపంకు ముఖ్య కారణాలు అన్నారు. దీర్ఘకాలంగా పోషకాహారం లోపిస్తే పెరుగుతున్న పిల్లల్లో ఫలితాలు తీవ్రంగా ఉంటాయన్నారు. వీరిలో జీవ క్రియ రేటు అధికంగా ఉండి తగినంత కార్బోహైడ్ కొవ్వు నిల్వలు ఉండవన్నారు. కాబట్టి కొద్ది కాలంలోనే ఈ నిల్వలు కరిగిపోయి పిల్లలు తమ శరీర ద్రవ్య పదార్థాన్ని కోల్పోతారు. దీనివల్ల వ్యాధి నిరోధక శక్తి తగ్గి అనారోగ్యానికి గురవుతారన్నారు. చిన్నారులకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలను వేయించాలన్నారు. అలాగే గర్భిణీ సంరక్షణలో భర్తల పాత్ర ఉండాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత స్వచ్ఛమైన తాగునీటి అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు ఎం.శ్రీదేవి, పి.ధనమ్మ, వై.సుహాసిని, ఆర్.కేశవ రత్నమ్మ, జి.ధనమ్మ, అంగనవాడి సహాయకులు, చిన్నారులు, గర్భిణీలు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నైపుణ్యభివృద్ధి పై అవగాహన




**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూర్‌లోని బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు నైపుణ్య అభివృద్ధి పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పదో తరగతి విద్యార్థులకు నైపుణ్యభివృద్ధి ఎంతగానో దోహదపడుతుందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సిహెచ్ మాల కొండయ్య పేర్కొన్నారు. సమగ్ర శిక్షణ స్కిల్ డెవలప్మెంట్ ఆధ్వర్యంలో లెర్నెట్ స్కిల్స్ తరఫున ఇంటర్ షిప్ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ఒకేషనల్ ఉపాధ్యాయుడు ప్రేమ్ చందు విద్యార్థులకు ఎలక్ట్రానిక్ అంశం గురించి సూచన చేశారు. యువత ఇంటర్ షిప్ అవకాశాలు కల్పించడానికి ఈ కార్యక్రమం ఉద్దేశం అన్నారు. విద్యార్థులకు మిక్సీ గ్రైండర్ మరమ్మత్తులను స్థానిక జీవిం హోమ్ నీడ్స్ షాపులో ప్రాక్టికల్ అనుభవాన్ని అందులో నైపుణ్యాలను విద్యార్థులు నేర్చుకున్నారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని పెంపొందిస్తుందన్నారు. పరిశ్రమలలో తక్షణమే ఉపాధికి మార్గం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## నూతన వక్ఫ్ చట్టం రద్దు కోరుతూ భారీ ర్యాలీ



**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రమైన ఏఎస్ పేటలో గురువారం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2025 నూతన వక్ఫ్ చట్టాన్ని రద్దు చేయాలంటూ ముస్లిం పెద్దలు, నిరసన ర్యాలీ చేపట్టారు. ముందుగా ఈ ర్యాలీను స్థానిక దర్గా సెంటర్ నుండి నల్ల బ్యాడ్జీలతో వక్ఫ్ చట్టంపై తమ నిరసన తెలుపుతూ బయలుదేరి నగరఖానా సెంటర్, బస్టాండ్ సెంటర్, మీదుగా తహసిల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం తహసిల్దార్ శ్రీ రామకృష్ణకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం మొండిగా ప్రవేశపెట్టిన 2025 నూతన వక్ఫ్ చట్టాన్ని రద్దు చేయాలని కోరారు. ముస్లిమ్స్ వక్ఫ్ బోర్డులో హిందువులును తొలగించాలన్నారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున ముస్లిం నాయకులు, ముస్లిం సోదరులు, ముస్లిం యువకులు, స్థానికులు ఆవాస్ కమిటీ నాయకులు సిపిఎం నాయకులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎలాంటి ఘటనలు జరగకుండా ఆత్మకూరు డీఎస్పీ వేణుగోపాల్ ఆధ్వర్యంలో సీఐ గంగాధర్ రావు, స్థానిక ఎస్ఐ ఏ.సైదులు, సబ్ డివిజన్ పరిధిలోని సంగం, ఆత్మకూరు, మర్రిపాడు, సోమశిల, ఎస్ఐలు, పోలీస్ సిబ్బందితో భారీ బందోబస్తు నిర్వహించారు.

## సీఎం సహాయనిధి చెక్కు పంపిణీ



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లాలోని కొడవలూరు మండలం గండవరం గ్రామంలోని శిగినం రమేష్ లబ్ధిదారుడికి సీఎం సహాయ నిధి చెక్కును గురువారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ డైరెక్టర్ శ వేమిరెడ్డి పట్టాభి రామిరెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదల ఆరోగ్యం ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమని పేర్కొన్నారు. పేదలకు అండగా టిడిపి ప్రభుత్వం ఉంటుందని చెప్పారు.

## రైతులు భూసార పరీక్షలు చేయించుకోవాలి



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** రైతులు పరీక్షలు చేయించుకోవాల్లని భూసార పరిరక్షణ కార్యక్రమంపై ఉదయగిరి మండల వ్యవసాయ అధికారి ఆంజనేయులు నాయక్ గురువారం మండల వ్యవసాయ అధికారి కార్యాలయం నందు నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా ఉదయగిరి మండలంలోని 17 రెవెన్యూ గ్రామాలకు గాను 340 భూసార పరీక్షలు నిర్వహించడానికి జిల్లా వ్యవసాయ అధికారిసూచనలు మేరకు తెలియజేశారు. భూసార పరీక్షల్లో 12 రకాల మూలకాలు పరీక్ష నిర్ధారణ చేసి రైతులకు భూసార పరీక్షలు జరిగినటువంటి పత్రాలను గ్రామస్థాయి వ్యవసాయ, ఉద్యాన అధికారుల ద్వారా రైతులుకి అందజేశారు. ప్రతి రైతు తప్పనిసరిగా ఖరీఫ్ పంట సమయం ముందు భూసార పరీక్షలు నిర్వహించుకొని తద్వారా వచ్చినటువంటి భూసార పరీక్ష పత్రాలను గమనించి అందులోని పంటలను, ఎరువులను వాడటం ద్వారా రైతులకు పంట ఖర్చు తగ్గి ఆదాయం పెరుగుతుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో గ్రామ స్థాయి వ్యవసాయ, ఉద్యాన సహాయకులు, విస్తీర్ణ అధికారి వారు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులకు చిరు సత్కారం



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** మండలంలోని చాకలకొండ గ్రామంలోని రాధాకృష్ణ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పని సర్దుబాటుపై కలిగిరి జలదంకి మండలం నుంచి విచ్చేసిన ఉపాధ్యాయులు ఎన్. లక్ష్మయ్య, పి.మహేష్ వారి విధులను సమర్థవంతంగా నిర్వహించినందుకు గాను పాఠశాల ప్రధానోపాధ్యాయులు పోలుబోయిన రమేష్ వారిద్దరిని చిరు బహుమతులతో సత్కరించారు. ఈ సందర్భంగా ప్రధాన ఉపాధ్యాయులు రమేష్ మాట్లాడుతూ.. తమ పాఠశాలకు పని సర్దుబాటులో భాగంగా ఇక్కడికి విచ్చేసిన ఉపాధ్యాయులు విద్యార్థులకు ఎంతో చక్కగా బోధించారన్నారు. అలాగే పాఠశాలలోని సహచర ఉపాధ్యాయులతో ఎంతో కలివిడిగా కలిసిపోవడం ఆనందదాయకమన్నారు. అనంతరం చిరు సత్కారం పొందిన ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. చిరు సత్కారమునకు అనుగుణంగా మరల పని సర్దుబాటు క్రింద మాకు అవకాశం వచ్చిన ఇదే పాఠశాలను మేము ఎన్నుకుంటామని చెప్పారు. ఇక్కడ పాఠశాలలో ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు నాపై చూపిన అభిమానాన్ని మర్చిపోలేమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** అగ్ని ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు గురువారం అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా గంగిరెడ్డిపల్లి గ్రామం ప్రాథమిక పాఠశాలలో అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మన ఫౌండేషన్ అధినేత టిడిపి రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహించడం చాలా మంచిదని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రతి ఒక్కరికి అగ్ని ప్రమాదాలపై అవగాహన వస్తుందని ముఖ్యంగా విద్యార్థులకు అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించడం మంచి కార్యక్రమమని అన్నారు. వేసవి కాలం కావడంతో అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉండడంతో ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని తగు సూచనలు సలహాలు పాటించాలని వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం చంద్రబాబుతోనే ఎస్సీ వర్గీకరణ సాధ్యమైంది

## టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి మాతంగి కృష్ణ



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతోనే గత 30 సంవత్సరాల మాదిగల పోరాట ఆకాంక్ష ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందని తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి మాతంగి కృష్ణ పేర్కొన్నారు. నెల్లూరు జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలోనే దళితుల అభివృద్ధి సాధ్యమని మరోసారి చంద్రబాబు రుజువు చేశారన్నారు. ఎస్సీ ఉప వర్గీకరణకు క్యాబినెట్ ఆమోదం తెలపడం హర్షనీయమన్నారు. త్వరలో విడుదల చేయనున్న డీఎస్సీ నోటిఫికేషన్‌తోనే విద్యా ఉద్యోగాలు రిజర్వేషన్ సమానంగా అందేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. గ్రూప్-1లో 12 ఉప కులాలకు -1 శాతం, గ్రూప్-2లో 18 ఉప కులాలకు 6.5, గ్రూప్-3లో 29 ఉపకులాలకు 7.5శాతం రిజర్వేషన్లు అమలయ్యేల ఆమోదం తెలిపిందని, అన్ని జిల్లాల్లో ఈ ఆర్డినెన్స్ అమల్లోకి వస్తుందని ప్రభుత్వం స్పష్టం చేసిందన్నారు. మాల మాదిగలతో సహా 59 ఉపకులాల ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో షెడ్యూల్ కులాలుగా గుర్తించారన్నారు. 1994లో ఎస్సీ వర్గీకరణ లక్ష్యంగా జూలై 7వ ప్రకాశం జిల్లా ఈదుమూడి గ్రామంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) ఏర్పాటై 30 సంవత్సరాలు పాటు పోరాటం ప్రారంభించారు. ఈ జీవో ప్రకారం ఎస్సీలను ఏ, బీ, సీ, డీ లుగా గ్రూపులుగా వర్గీకరించారన్నారు. 2024 నవంబర్ 15 రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజాన్ మిశ్రా అధ్యక్షతన ఏకసభ్య కమిషన్ ను కూటమి ప్రభుత్వం నియమించిందని రాష్ట్రంలో 13 జిల్లాల్లో పర్యటించి ఆయా వర్గాల నుంచి అభిప్రాయం సేకరించారు సిద్ధం చేసిన నివేదికను 2025 మార్చి 10న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయనంద్‌కు అందించారన్నారు. సుప్రీం కోర్ట్ ఇచ్చిన తీర్పు మేరకు వర్గీకరణ చేసామని రాష్ట్రంలో ఎస్సీలకు 3 గ్రూపులుగా వర్గీకరిస్తూ కమిషన్ సిఫార్సు చేసిందనిరెల్లితో సహా 12 ఉపకులాలను మొదటి గ్రూపుగా మాదిగలతోపాటు 18 ఉప కులాలను రెండో గ్రూపుగా మాలలతోపాటు 29 ఉప కులాలను మూడో గ్రూపుగా వర్గీకరించిందన్నారు. రోస్టర్లో 200 పాయింట్లు విధానం తీసుకున్నారాణి దీని ప్రకారం మొదటి 100 పోస్టుల్లో రెల్లి ఉప కులాలకు 1, మాదిగ ఉపకులాలకు 6, మాల ఉపకలాలకు 8 చొప్పున పోస్టులు వస్తాయన్నారు. 100 పోస్టులలో రెల్లి ఉప కులాలకు 1, మాదిగ కులాలకు 6, మాల కులాలకు 8 చొప్పున పోస్టులు వస్తాయి. రెండో 100 పోస్టులలో రెల్లి ఉప కులాలకు 1, మాదిగ ఉప కులాలకు 7, మాలల ఉపకులాలకు 7 చొప్పున పోస్టులు వస్తాయని దీనివల్ల రోస్టర్‌లో అందరికీ న్యాయం జరుగుతుంది. గ్రూప్ 1 అత్యంత వెనుకబడిన వర్గం రెల్లి ఉప కులాలకు కలిసి మొత్తం 12 (1)రెల్లి 2, బాపూరి 3, చాచాటి 4, చందాల 5, దండాసి 6, ధోమ్, డొంబోరా, పైడి పోనా 7, గస్కికి హుండ్లే రెల్లి చాచండి 8, గోధుగని గొందుగుల 9, మొహర్తా 10, పాకీ మోతి తోటి 11, పామిడి 12, సప్ర అదేవిధంగా గ్రూప్ 2 మాదిగ, అరుంధతి, బండ్ల, చమీర్, యోచి ముంచి చామర్ రవి దాస్ చామర్ రోహిదాస్, చంబర్, దక్కల్ డొక్కల్వార్, దోర్, గోదారి, గుంపొంగి, జగ్గలీ, జంబుపులు, కొలువుల వండ్లు, మాదిగ దాస్ మస్తీన్, మంగే, మంగే, మాతంగి, సముగారా సింగోల్లు చిందోళ్లు. గ్రూప్-3 తక్కువ వెనకబడిన వర్గం మాల దాని ఉప కులాలు 29 ఆది ద్రావిడ, అనముఖ, ఆరాయే మాలా, అరవ మాల, బరికి, బ్యాగారి, చలవడి, ఎలామల వారు, అహెూలియా, హోలియా దాసరి, మాదాసి కురువ మాదారి కురవ, మహార్, మాల అయ్యవారు, మాల దాసరి, మాల దాసు, మా హానె, మాల జంగం, మాలమస్తి, మాల సాలె నెత్తి కానీ, మాల సన్యాసి, మన్నే, మండాల, సంబం, యాతల, ఒళ్ళు వన్నె, ఆది ఆంధ్ర, నష్టి, మీద అయ్యా అలవర్, పంచమా కురియా అని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి కూవరపు నాగేశ్వరరావు పాదర్తి నర్సింలు కోవూర్ నియోజకవర్గం టిడిపి నాయకులు కొండా వెంకయ్య వడ్లమూడి సుమన్ చైతన్య నవీన్ టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు పాల్గొన్నారు.

# విజేతలకు బహుమతులు అందజేసిన ఎమ్మెల్యే



**కావలి, మేజర్‌న్యూస్ :** మీకోసం స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో కావలి జడ్పీ గ్రౌండ్ నందు నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో మీకోసం క్రికెట్ ట్రోఫీని గెలుపొందిన ముసునూరు వారి యర్ టీమ్ సభ్యులకు ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి అభినందనలు తెలుపుతూ వారికి ట్రోఫీ, మెడల్, సర్టిఫికెట్స్ అందజేశారు. సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే విద్యార్థులు క్రీడల పట్ల ఆసక్తి పెంచుకుంటూ క్రీడల్లో మంచి నైపుణ్యాన్ని ప్రదర్శించి రాష్ట్ర, దేశ ప్రతిష్టను పెంపొందించాలన్నారు. మీకోసం సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు దిలీప్ కుమార్ రాయపాటి మాట్లాడుతూ.. విద్యార్థులలో ఉన్న క్రీడా నైపుణ్యాలని గుర్తించి అటువంటివారిని ప్రోత్సహించడంలో భాగంగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం జరిగిందన్నారు. ఈ టోర్నమెంట్లో పోటాపోటీగా అన్ని టీములు పోటీ పడగాచివరగా ముసునూరు వారియర్స్ టీం అన్ని విభాగాలలో చక్కగా రాణించి విజయం సాధించడం ద్వారా మీకోసం ట్రోఫీని అందుకోవడం చాలా సంతోషకరమని అన్నారు. ట్రోఫీని గెలుపొందిన ముసునూరు వారియర్స్ టీంకు కావలి అభివృద్ధి ప్రదాత, నిత్య ప్రజా సేవకుడు, క్రీడలను ప్రోత్సహించే ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి చేతుల మీదుగా ట్రోఫీని,మెడల్స్ ను, సర్టిఫికెట్స్‌ను అందుకోవడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో గుంటుపల్లి రాజ్ కుమార్ చౌదరి, టోర్నమెంట్ నిర్వహించిన డానియల్ బాబ్జి, ఎంపైర్స్‌గా వ్యవహరించిన ఆర్.డి.ఎస్ నికిత్, ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.

# కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమస్యలు పరిష్కరించాలని నిరసన




**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమస్యలను పరిష్కరించాలని గురువారం వింజమూరు మండలంలోని చాకల కొండ పీహెచ్‌సి ముందు శాంతియుత నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు చాకలకొండ, మండలంలోని 10 గ్రామాలలో పని చేస్తున్న కమ్యూనిటీ హెల్త్ అధికారుల సమస్యలు పరిష్కరించాలని ఈ నిరసన వ్యక్తం చేశారు. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులతో సమానంగా 23వాతం వేతన సవరణ జరపాలని ఆయుష్మాన్ భారత్ నిబంధన మేరకు ఉద్యోగ భద్రత కల్పించాలని పని ఆధారిత ప్రోత్సాహకాలను క్రమబద్ధీ కరించాలని వారు తెలిపారు. అలాగే ఈపీఎఫ్ పునరుద్ధరించాలని నిర్దిష్టమైన జాబ్ చార్టును ఇవ్వాలని అదేవిధంగా హెచ్‌ఆర్ పాలసీ ప్రకారం ఇంక్రిమెంటు బదిలీలు అమలు చేయాలని వారు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించే వరకు ఆన్లైన్ పనులు నిలిపివేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు తదితరులున్నారు.

## విద్యుత్ ఘాతంతో గిరిజన మహిళ మృతి



**తోటపల్లి గూడూరు, మేజర్‌న్యూస్ :** శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా తోటపల్లి గూడూరు మండలం కోడూరు పంచాయతీ లోని రోడ్డు మార్గంలో అల్లిపురంకి చెందిన రైతు లక్ష్మీనారాయణ రొయ్యల గుంటలను కౌలుకు చేస్తున్నారు. ఐతే నారాయణ వద్ద కాపలా దారుగా ఉన్న గిరిజన కుటుంబానికి చెందిన పోలయ్య భార్య చెంచమ్మ నిండు గర్భిణీ బుధవారం రాత్రి విద్యుత్ షాక్ కు గురై మృతి చెందింది. స్థానికుల సమాచారం మేరకు ఈ కుటుంబం అల్లీపురానికి చెందిన లక్ష్మీనారాయణ గుంటల వద్ద కాపలా దారులుగా ఉంటున్నారు. గుంటల వద్ద భద్రత కొరకు యజమాని ఫెన్సింగుకు విద్యుత్ సరఫరా వచ్చేలా కనెక్షన్ ఇవ్వడంతో ఇది గమనించని పోలయ్య భార్య చెంచమ్మ ఫెన్సింగ్ తాకి శరీరం పూర్తిగా కాలి మృతి చెందినట్లు తెలిసింది. ఈ విషయం పొద్దుపోయిన తర్వాత యజమాని గమనించడంతో గుట్టుగా ఎవరికి అనుమానం రాకుండా హుటాహుటిన మృతదేహాన్ని తరలించి ఖననం చేసినట్లు తెలుస్తుంది. మృతి చెందిన చెంచమ్మకు ఇద్దరు పిల్లలు ప్రస్తుతం 8నెలలు గర్భిణిగా ఉండడం తో పిల్లలు అనాథలయ్యారు. ఈ పేద గిరిజన కుటుంబానికి తగిన న్యాయం చేయాలని పలువురు గిరిజన సంఘాలు ఎస్సీ నేతలు డిమాండ్ చేస్తున్నారు. అయితే మృతదేహాన్ని రహస్యంగా ఖననం చేయడానికి విద్యుత్ షాకేనా ఇంకేమైనా కారణాలు ఉన్నాయా అని స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

## ఉదయగిరి న్యాక్ కేంద్రంలోనే శిక్షణ కార్యక్రమాలు

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** పట్టణ సమీపంలోని విద్యుత్ సబ్ స్టేషన్ ఎదురుగా గల న్యాక్ కేంద్రంలో పీఎం విశ్వకర్మ శిక్షణ కార్యక్రమాలు జరుగుతాయని కేంద్ర నిర్వాహకులు లక్కినేని. ప్రకాష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానమంత్రి విశ్వకర్మ నందు రిజిస్ట్రేషన్ చేసుకున్న టైలర్, తాపీ పని, ధోబి, చర్మకారులకు ఐదు రోజులపాటు శిక్షణ కార్యక్రమం జరుగుతుందన్నారు. రిజిస్ట్రేషన్ స్టేటస్ నుపరిశీలించుకోవాలన్నారు. శిక్షణకు అర్హులైన వారు దూర ప్రాంతాలకు వెళ్లి ఇబ్బందులు పడకుండా, ఉదయగిరిలో ని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ కేంద్రంలో శిక్షణ పొందవచ్చు అన్నారు. మరిన్ని వివరాలకు 9492334643 సెల్ నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

## మాదరాజు గూడూరు గ్రామాన్ని సందర్శించిన వ్యవసాయ అధికారులు



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ మండల వ్యవసాయ అధికారి మరియు సహాయ వ్యవసాయ సంచాలకులు నెల్లూరు వారు మాదరాజు గూడూరు గ్రామం సందర్శించి అక్కడ రైతులు నిల్వచేసిన ధాన్యాన్ని సందర్శించడం జరిగింది. అలాగే రైతులకు పలు సూచనలు చేస్తూ ధాన్యం బస్తాల పైన టార్పాలిన్ పట్టలు కప్పుకోవాల్సిందిగా తెలియజేశారు. అనంతరం వాతావరణ సూచన మేరకు వర్షాలు వచ్చే అవకాశం ఉంది కాబట్టి ధాన్యం ఎండబెట్టుకునే రైతులు విధిగా తార్పాలిన్ పట్టలను దగ్గర ఉంచుకొని సమయానుకూలంగా ధాన్యాన్ని కప్పుకొని వర్షంలో తడవకుండా కాపాడుకోవలసిందిగా రైతులకు సలహాలు ఇచ్చారు తర్వాత భూసార పరీక్షల గురించి తెలియజేసి రైతుల పొలాల్లో మట్టి నమూనాల్ని ఎలా సేకరించాలని తెలియజేశారు. ప్రతి రైతు తన పొలంలోని మట్టిని గ్రామంలోని వ్యవసాయ విస్తరణ అధికారికి ఇచ్చి వారి పొలంలోని భూసారాన్ని తెలుసుకోవాలని తెలియజేశారు.

# కార్పొరేట్‌కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు

## ప్రభుత్వ పాఠశాలలోనే మీ పిల్లలను చేర్పించండి



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** కార్పొరేట్ ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయని తల్లిదండ్రులు ఆలోచించి ప్రభుత్వ పాఠశాలలోనే తమ బిడ్డలను చేర్పించాలని స్థానిక బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిహెచ్ మాలకొండయ్య తెలిపారు గురువారం మండలంలోని ప్రాథమిక పాఠశాలల సందర్శించి ఐదవ తరగతి పూర్తి చేసుకుని ఉన్న విద్యార్థులను వివరాలను సేకరించి వారి ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అన్ని సౌకర్యాలతో పాటుగా మేలైన విద్యా బోధన ఉంటుందని ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నట్లు అయిందని తెలిపారు. అలాగే ప్రభుత్వం విద్యార్థులకు అవసరమైన పౌష్టికాహారం మధ్యాహ్న భోజన రూపంలో అందిస్తుందని సమరూప దుస్తులు పుస్తకాలు నోటు పుస్తకాలు బూట్లు అందిస్తుందన్నారు. విద్యార్థులు ప్రైవేట్ పాఠశాల మోజుల్లో పడి ప్రభుత్వ పాఠశాలను విస్మరించరాదన్నారు. అలాగే విద్యార్థుల తల్లిదండ్రులు కూడా ఆలోచించి తమ బిడ్డల బంగారు భవిష్యత్తు కోసం ప్రభుత్వ పాఠశాలలో చదివించవలసిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మాల్యాద్రి శ్రీనివాసులురెడ్డి, మల్లికార్జునరావు, మీరావలి జెవెంకటేశ్వర్లు, కొండారెడ్డి చందన్ శైలజ తదితరులు ఉన్నారు.

# రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో ప్రపంచ హిమోఫిలియా దినం



**కావలి, మేజర్‌న్యూస్ :** హిమోఫిలియా అంటే రక్తం గడ్డకట్టే సామర్థ్యం తక్కువగా ఉండే జన్యు పరమైన రుగ్మత అని, తెలుగులో దీనిని రక్తస్రావ వ్యాధి అని అంటారని రెడ్ క్రాస్ తలసేమియా డే కేర్ సెంటర్ వైద్యాధికారులు, చిన్నపిల్లల వ్యాధి నిపుణులు డాక్టర్ మనోహర్ బాబు, డాక్టర్ శ్రీధర్ లు పేర్కొన్నారు. గురువారం ప్రపంచ హిమోఫిలియా దినాన్ని కావలి రెడ్ క్రాస్ డే కేర్ సెంటర్ లో నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మనోహర్‌బాబు మాట్లాడుతూ.. ఈ రుగ్మత ఉన్న వారిలో, గాయం అయినప్పుడు రక్తం గడ్డకట్టడానికి ఎక్కువ సమయం పడుతుంది. లేదా రక్తస్రావం ఆపడానికి ఎక్కువ సమయం పడుతుందని అన్నారు. ఈ వ్యాధి ఉన్నవారికి గాయం అయ్యి, రక్తస్రావం అవుతున్నప్పుడు రక్తంలోని బాగమైన ఫ్రెష్ ఫ్లోజోన్ ప్లాస్మా ఎక్కిస్తారని వివరించారు. పురుషులలో ఈ వ్యాధి ఎక్కువగా ఉంటుందని, స్త్రీలలో తక్కువని అన్నారు. స్త్రీలు ఈ వ్యాధి వాహకులుగా ఉంటారని అన్నారు. అనంతరం డాక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ.. ప్రపంచం మొత్తంలో దాదాపు నాలుగు లక్షల మంది హిమోఫిలియా వ్యాధిగ్రస్తులు ఉంటే, మనదేశంలోనే ఒకటిన్నర లక్షల మంది ఉన్నారని, వ్యాధి నిర్ధారణ కానివారు, తమకు ఆ రుగ్మత ఉందని తెలియని వారు కూడా ఎక్కువ సంఖ్యలో ఉండవచ్చని అన్నారు. ఈ వ్యాధి ఉన్నవారికి దెబ్బ పైకి కనపడక పోయినా, అంతర్గత రక్తస్రావం జరుగుతుందని, ఒకవేళ తలలో అంతర్గత రక్తస్రావం జరిగితే కోమాలోకి వెళ్తారని అన్నారు. ఈ జబ్బు లక్షణాలు కనిపిస్తే వెంటనే డాక్టర్లను సంప్రదించాలని వివరించారు. కార్యక్రమంకు అధ్యక్షత వహించిన కావలి రెడ్ క్రాస్ ఉపాధ్యక్షులు డాక్టర్ బెజవాడ రవికుమార్ మాట్లాడుతూ, హిమోఫిలియా ఉన్నవారికి రెడ్ క్రాస్ రక్తకేంద్రాలలో ఉచితంగా రక్తం అందిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తలసేమియా డే కేర్ సెంటర్‌లో సేవలు అందిస్తున్న డాక్టర్ మనోహర్ బాబు, శ్రీధర్, డాక్టర్ రమ్య, స్టాఫ్ నర్స్ శేషమ్మలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కావలి రెడ్ క్రాస్ చైర్మన్ డి రవిప్రకాష్, వైస్ చైర్మన్ కె.హరినారప రెడ్డి, కోశాధికారి అరికట్ల మధుసూదన్ రావు, కార్యదర్శి బియస్ ప్రసాద్, పాలకమండలి సభ్యులు ఓరుగంటి వెంకటేశ్వర్లు, గొట్టిపాటి మనోరమ, యన్ ప్రణీత్, సభ్యులు కల్లయ్య, హరిచందన, జిల్లా పాలకమండలి సభ్యులు కలికి శ్రీహరి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శబ్ద కాలుష్యాన్ని నివారించాలని డీఎస్పీకి వినతి



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలో, ట్రంకు రోడ్డు ఇతర పరిసర ప్రాంతాల్లో ఈ మధ్యకాలంలో విద్యార్థులు, ద్విచక్ర వాహనదారులు పెద్ద శబ్దంతో ద్విచక్ర వాహనాలు నడుపుతూ మితిమీరిన వేగంతో నడుపుతున్నారని, శబ్ద కాలుష్యాన్ని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని గురువారం డివి ఎంసి మేంబర్ ఐ.సాయి ప్రసాద్ డీఎస్పీ శ్రీధర్‌కి వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కావలి పట్టణంలో ఆటో డ్రైవర్లు ఆటోలకి ఇరుపక్కల ప్రయాణికులను కూర్చోబెట్టి,అలాగే లౌడ్ స్పీకర్స్‌తో పాటలు పెట్టుకుని ప్రయాణికులకు, ద్విచక్ర వాహనంలో తిరిగే వ్యాపారస్తులకు, ఇతరులకు అభ్యంతరాలు కలుగజేస్తున్నారని, అలాగే వీటి వలన ప్రమాదాలు కూడా ఎక్కువయ్యాయని ప్రధాన కూడలి అయినా ఆర్టీసీ బస్టాండ్ ఒంగోలు బస్టాండ్ స్థానిక రూపాయి మిద్దె సెంటర్లో తరచు వీటి వలన ప్రమాదాలు జరుగుతున్నాయని వీటిపై పర్యవేక్షించి, అవసరమైన చోట పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేసి, ఈ శబ్ద కాలుష్యం నుంచి నివారించాలని, అలాగే హైకోర్టు ఇచ్చిన ఆదేశాల ప్రకారం బైక్ రైడర్స్‌పై చర్యలు తీసుకోవాలని, ఇలాంటి ప్రమాదాలను జరగకుండా వీటిని నివారించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం డీఎస్పీ శ్రీధర్ సానుకూలంగా స్పందించారు.

## న్యాయవాది గుమస్తాల కార్యవర్గం ఎన్నిక

**నెల్లూరు లీగల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు న్యాయవాది గుమస్తాల కార్యవర్గ ఎన్నికలు జిల్లా కోర్టు ఆవరణలోని వారి సంఘ కార్యాలయంలో ఏకగ్రీవంగా జరిగాయి. నెల్లూరు న్యాయవాద గుమస్తాల సంఘ అధ్యక్షుడిగా కే.వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడిగా యూ.ఆంజనేయులు, కార్యదర్శిగా జి.నాగేశ్వరరావు, ట్రెజరర్‌గా సుధాకర్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా న్యాయవాది గుమస్తాల కార్యవర్గాన్ని పలువురు న్యాయవాదులు, న్యాయవాదుల సీనియర్ గుమస్తాలు అభినందించారు.

## ఇద్దరు పంచాయతీ కార్యదర్శులు సస్పెన్షన్ : డీపీఓ



**నెల్లూరు టౌన్, మేజర్‌న్యూస్ :** మనుబోలు మండలం వీరంపల్లి గ్రామపంచాయతీ కార్యదర్శి కే ఆదిలక్ష్మి, బోగోలు మండలం నాగులవరం గ్రామపంచాయతీ కార్యదర్శి ఎం భాస్కరరావును గురువారం జిల్లా కలెక్టర్ సస్పెండ్ చేసినట్లు జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. పంచాయతీ కార్యదర్శి భాస్కరరావు విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించడం పంచాయతీ నిధులు 23,593 రూపాయలు దుర్వినియోగం చేసినట్లు పలు ఆరోపణలు రావడంతో విచారించి అతని సస్పెండ్ చేయడం జరిగింది అన్నారు. అదేవిధంగా పంచాయతీ కార్యదర్శి ఆదిలక్ష్మి విడలూరు మండలం ముదివర్తి గ్రామపంచాయతీలో పనిచేసిన సమయంలో 1,09650 నిధుల దుర్వినియోగంలో 54,280 రూపాయలు అభ్యంతరకరంగా ఖర్చు చేసినందువల్ల విచారించి ఆమెను సస్పెండ్ చేయడం జరిగిందని జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్ రెడ్డి తెలిపారు.

# రేపు మెగా రక్తదాన శిబిరం

**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** పేదల ఆరాధ్య దైవం.. సింహపురి సింహం. ప్రింట్ ఆఫ్ నెల్లూరు జన నాయకులు.. అవిశ్రాంత శ్రామికులు.. అలుపెరుగని సేవకులు అయిన మన నెల్లూరు ముద్దుబిడ్డ.. నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి పుట్టినరోజు వేడుకలను విజయవంతం చేయాలని కేతంరెడ్డి వినోద్‌రెడ్డి కోరారు. ఆయన పుట్టినరోజును పురస్కరించుకొనిలి ఈనెల 19వ తేదీ ఉదయం 8 గంటల నుంచి గొలగమూడి రోడ్డులోని విపిఆర్ కన్వెన్షన్ సెంటర్లో మెగా లిరక్తదాన శిబిరం జరుగుతుందన్నారు కావున విపిఆర్ అభిమానులు ఈ మెగా రక్తదాన శిబిరంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## వీధిలైట్ల సమస్య పరిష్కారం



**బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ :** బుచ్చిరెడ్డిపాళెం పట్టణంఖాజా నగర్ 7వ వార్డ్‌లో పలుచోట్ల వీధిలైట్లు లేకపోవడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో స్థానిక టిడిపి నాయకుడు సుభాని సమస్యను చైర్పర్సన్ మోర్ల సుప్రజ మురళి, వైస్ చైర్మన్ నస్రిన్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వెంటనే వారు వీధిలైట్లను ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా స్థానిక ప్రజలు వారికి ధన్యవాదాలు తెలిపారు.

## బధిరుల ఆశ్రమ పాఠశాలలో ప్రవేశాలకు ఆహ్వానం



**బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ :** బుచ్చిరెడ్డిపాలెం ప్రగతి చారిటబుల్ ట్రస్ట్ బధిరుల ఆశ్రమ పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి గాను ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తునట్లు పాఠశాల యాజమాన్యం ప్రకాష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బాలబాలికలకు ప్రత్యేకమైన హాస్టల్ ఉందని, నెల్లూరు జిల్లా వారు పాఠశాలలో ప్రవేశానికి అర్హులన్నారు. 1వ తరగతిలో చేరేందుకు 6 సంవత్సరాల నుంచి 8 ఏళ్ల మధ్య వయస్సు ఉండాలన్నారు. బదిలీ సర్టిఫికేట్‌లపై అన్ని తరగతులకు ప్రవేశం ఉందన్నారు. అయితే వినికిడి లోపం ఉన్నట్లు సదరం సర్టిఫికేట్, పాఠశాల బదిలీ సర్టిఫికేట్, ఆధార్ కార్డు, జిరాక్స్ కాపీతో తమ పాఠశాలలో సంప్రదించాలన్నారు.ఉచిత విద్య, హాస్టల్, భోజనంతో పాటు ప్రభుత్వం కల్పించే అన్ని రకాల సదుపాయాలు ఉచితంగా కల్పిస్తున్నారు. సుశిక్షితులైన ఉపాధ్యాయులచే విద్యాబోధన, అత్యాధునిక సంకేతిక పరిజ్ఞానంతో చదువు నేర్పుతున్నట్లు పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం 1వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాదిస్తున్నారు. ఆసక్తిగల బధిర (మూగ, చెవిటి) విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరు. పూర్తి వివరాలకు సెల్ నంబర్స్ - 9989346709, 9248651399 సంప్రదించాలని తెలిపారు.

## కావలి మున్సిపాలిటీలో దొంగల పడ్డారా..

# ట్రేడ్ లైసెన్స్ మోసం ఏమిటి?

**కావలి, మేజర్‌న్యూస్ :** ఇటీవల కాలంలో మునిసిపాలిటీ కి చెందిన వాట్సాప్ నెంబర్లకు ట్రేడ్ లైసెన్స్ వ్యాపారస్తులు తమ వ్యాపారాలు న్యాయబద్ధంగా చేసుకోవాలంటే ట్రేడ్ లైసెన్సులు తప్పనిసరి అయింది. ఈ ట్రేడ్ లైసెన్సులు మున్సిపాలిటీకి రుసుము చెల్లించి సిటిఓ ఆఫీస్ లో దీనికి సంబంధించిన పత్రాలను పరిమిషన్లను తీసుకోవాల్సి ఉంటుంది. ట్రేడ్ లైసెన్స్ దారుల జాబితా ఒక లిస్టు మున్సిపాలిటీలోనూ, మరొక లిస్టు సి.టి.ఓ ఆఫీస్ లో ఉంటుంది. అయితే మున్సిపాలిటీ వారికి వ్యాపారస్తులు, హెూల్సేల్ దుకాణదారులు చెల్లించవలసిన ట్రేడ్ లైసెన్సు రుసుమును ఎవరో కొంతమంది అజ్ఞాత వ్యక్తులు వాట్సాప్ నెంబర్ ఇచ్చి ఆ వాట్సాప్ నెంబర్లకు ఫోన్ పే చేస్తూ గత కొన్ని సంవత్సరాల నుంచి ఇలాగే మోసం జరుగుతుంది. ఇటీవల కాలంలో ఈ విషయాన్ని కావలి మున్సిపల్ సిబ్బంది కమిషనర్ లోతుగా విచారించి విషయాన్ని కనుగొన్నారు. వ్యాపారస్తులు వేరే ఎవరో వాట్సాప్ నెంబర్లకు రెవెన్యూ ట్రేడ్ లైసెన్స్ రుసుము చెల్లిస్తున్నట్లు సమాచారం అందుకున్న మున్సిపల్ సిబ్బంది ఇటీవల కాలంలోనే కావలి వన్ టౌన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఫిరోజ్ కీ లిఖితపూర్వకంగా నెంబర్లతో సహా ఫిర్యాదు ఇవ్వడం జరిగింది. దీనిపై సర్కిల్ ఇన్స్పెక్టర్ విచారించి రెండు వాట్సప్ నెంబర్లు లో ఒకనంబర్‌ని కనుగొన్నారు. ఇంకొక నెంబర్ కూడా త్వరలో తెలుసుకొనున్నట్లు సమాచారం. ఎంతమంది ఈ స్కామ్‌లో ఉన్నారు అనేది ఈ మున్సిపాలిటీ కి సంబంధించిన సిబ్బందికి మాత్రమే తెలుసు. ఈ మోసాలకు పాల్పడుతుంది ఎవరు? మున్సిపల్ సిబ్బంది లేక.. ప్రైవేటు వ్యక్తులా.. అనేది త్వరలో ఈ మోసాలకి తెరదీయున్నట్లు సమాచారం.

# పారిశుధ్య పనులు పర్యవేక్షించిన అదనపు కమిషనర్



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ వైఠ నందన్ పారిశుధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా గురువారం స్థానిక 51వ డివిజన్ రైల్వే ఫీడర్స్ రోడ్డు, 52వ డివిజన్ రంగనాయకులపేట తదితర ప్రాంతాలలో పర్యటించారు. రోడ్లపై ఉన్న పిచ్చి మొక్కలు, ముళ్ళపొదలు, ఇతర వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించేలా పారిశుధ్య విభాగం సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డ్రైను కాలువల పూడికతీత, సిల్ట్ ఎత్తివేత క్రమం తప్పకుండా జరపాలని సూచించారు. రోడ్డు ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగించుకోవాలని స్థానికులకు సూచించారు. రోడ్ల ఆక్రమణలను గుర్తించి సంబంధిత యజమానులకు నోటీసులు జారీ చేయాలని సూచించారు. భవన నిర్మాణ సామాగ్రి రోడ్లను ఆక్రమించకుండా వార్డు సచివాలయ ప్లానింగ్ సెక్రెటరీలు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. భవన నిర్మాణ సామాగ్రి వీధులకు అంతరాయం కల్పిస్తూ ఉంటే వారి నుంచి జరిమానా వసూలు చేయాలని సూచించారు. నెల్లూరు నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగం అనుమతుల ప్రకారం మాత్రమే కట్టుబడి జరిగేలా పర్యవేక్షించాలని అనుమతులు లేని అదనపు నిర్మాణాలు జరుగుతుంటే, ఆయా నిర్మాణాలను వెంటనే ఆపివేయాలని అదనపు కమిషనర్ ఆదేశించారు.

# రూరల్ నియోజకవర్గంలో.. 5 ఏసీ బస్ షెల్టర్లు ప్రారంభోత్సవం



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ నియోజకవర్గం పరిధిలోని ఐదు బస్సు షెల్టర్లు ప్రారంభోత్సవ కార్యక్రమంలో టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, మాజీ మేయర్ నంది మండలం భాను శ్రీ, నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ నందన్ పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి మాట్లాడుతూ.. నెల్లూరు రూరల్ నియోజకవర్గం పరిధిలో 5 ఏ.సీ. బస్ షెల్టర్లు ప్రారంభించుకోవడం చాలా సంతోషంగా ఉందని తెలియజేయడం జరిగింది. అదేవిధంగా ఈ వేసవికాలంలో వయోవృద్ధుల, పిల్లల, గర్భిణీ స్త్రీల, మహిళల, సౌకర్యార్థం కోసమే ఈ ఏసీ బస్ స్టాప్‌లు ప్రారంభించడం జరిగిందని తెలియజేయడం జరిగింది. అలాగే గత వైఎస్ఆర్. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం వీటిని వినియోగంలోకి తీసుకురాకపోగా, వీటిని గాలికి వదిలేసి, నిరుపయోగంగా ఉన్న ఏసీ బస్సు షెల్టర్లను కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే మంత్రి నారాయణ సహకారంతో వీటిని మరల పునః ప్రారంభించుకోవడం జరిగిందని తెలియజేశారు. అనంతరం ప్రజాధనం దుర్వినియోగం కాకుండా మళ్లీ ప్రజలకు అందుబాటులోకి తెచ్చాం. వీటిని పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రజలపై కూడా తెలియజేశారు. అలాగే నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో ఇంత పెద్ద ఎత్తున అభివృద్ధి పనులకు సహకరిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కి, యువ నాయకులు, రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌కి, మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణకి కలెక్టర్‌కి, కమిషనర్‌కి, అధికార యంత్రాంగానికి నెల్లూరు రూరల్ నియోజకవర్గ ప్రజల పక్షాన ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు క్లస్టర్ ఇంచార్జీలు తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణకు క్యాబినెట్ ఆమోదంపై హర్షం



**కావలి, మేజర్‌న్యూస్ :** ఎస్సీ వర్గీకరణకు రాష్ట్ర క్యాబినెట్ ఆమోదించడం తెలపడం శుభపరిణామమని నెల్లూరు పార్లమెంట్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కాకి ప్రసాద్ తెలియజేశారు. కావలి టీడీపీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. గతంలో 2000 సంవత్సరంలో వర్గీకరణ చేసిన ఘనత చంద్రబాబు నాయుడు దేనిని తెలిపారు. దళితుల అభివృద్ధి కూటమి ప్రభుత్వం తోనే సాధ్యమని చంద్రబాబు నాయుడు నిరూపించుకున్నారని అన్నారు. గతంలో రామచంద్రరావు కమిషన్, ఉషా మెహ్రా కమిషన్ వేసిన ఘనత కూడా చంద్రబాబు దేనని అన్నారు. మొత్తము ఎస్సీలను 3 గ్రూపులుగా విభజించి అందరికీ సమన్యాయం జరిగేలా కూటమి ప్రభుత్వం ఆలోచించి నిర్ణయం తీసకుందన్నారు. ఎస్సీలలోని 59 కులాల వారికి ఇక సమన్యాయం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కావలి నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు దావులూరి దేవకుమార్, కావలి పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షులు అక్కిలిగుంట సూర్యప్రకాష్, పాల్గొన్నారు.

## మృతుల కుటుంబ సభ్యులకు ప్రసన్న కుమార్‌రెడ్డి పరామర్శ



**బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ :** బుచ్చిరెడ్డిపాలెం మండలం రేబాల గ్రామానికి చెందిన వల్లూరు అశోక్ రెడ్డి మాతృమూర్తి వల్లూరు సులోచనమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యుల్ని పరామర్శించి.. అనంతరం పంచేడు గ్రామానికి చెందిన సూరా ప్రసాద్‌రెడ్డి మాతృమూర్తి సూరా సుగుణమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో బుచ్చిరెడ్డిపాలెం నగర పంచాయతీలోని వారి నివాసానికి వెళ్లి వారి చిత్రపటానికి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ మంత్రి, రాష్ట్ర వైసీపీ అధికార ప్రతినిధి, రాష్ట్ర వైసీపీ పిఏసి సభ్యులునల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి. ఈ కార్యక్రమంలో బుచ్చి మండల పార్టీ అధ్యక్షులు చెర్లో సతీష్ రెడ్డి, బుచ్చినగర పార్టీ అధ్యక్షులు షేక్ షాహుల్, బోగోలు దయాకర్ రెడ్డి, పోతిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, చిల్లకూరు శ్రీనివాసులురెడ్డి, కడివేటి అన్వేష్, అశోక్, కృష్ణారెడ్డి, హరి పాల్గొన్నారు.

## మూలస్థానేశ్వర స్వామి హుండీల లెక్కింపు



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు మూలాపేటలో వేంచేసియున్న శ్రీ భువనేశ్వరి సమేత శ్రీ మూలస్థానేశ్వర స్వామి వారి దేవస్థానం నందు శ్రీ స్వామి అమ్మవారుల హుండీలు లెక్కింపు గురువారం ఉదయం 10.30 గంటలకు వి.గోపి కార్యనిర్వహణాధికారి శ్రీ వేదగిరి లక్ష్మీ నరసింహస్వామి వారి దేవస్థానం, నరసింహ కొండ వారి ఆధ్వర్యంలో, సీనియర్ సిటిజన్స్ స్టేట్ బ్యాంక్ ఎంప్లాయిస్, దేవస్థాన సిబ్బంది, భక్తుల సమక్షంలో హుండీల లెక్కింపు జరిగింది. ఈ హుండీల వలన వచ్చిన జమ (02.01.2025 నుండి 17.04.2025) వరకు 3నెలల 15 రోజులకు గాను హుండీల లెక్కింపు వలన వచ్చిన జమ రూ.802,323, బంగారం 007-700మిగ్రా,వెండి 000-139 గ్రాము, ఈ మొత్తం అమౌంట్ ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్, మూలాపేట నందు జమచేయబడిందని కార్యనిర్వాహణాధికారి అర్వ భూమి వెంకట శ్రీనివాసుల రెడ్డి తెలిపారు.

## మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్సీ పర్వతరెడ్డి



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు 47 డివిజన్ గుప్తా పార్క్ సెంటర్‌లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని గురువారం ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా 49వ డివిజన్లో వైసిపి నాయకులు షఫీ ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం ప్రజలకు, పలువురు విద్యార్థులకు చంద్రశేఖర్ రెడ్డి మజ్జిగ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవి దృష్ట్యా ప్రజల దాహార్తిని తీర్చేందుకు వైఎస్ఆర్‌పి ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేయడం ఎంతో సంతోషకరమని తెలిపారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ఏదో ఒక మంచి కార్యక్రమం చేపడుతూ.. ప్రజలకు అండగా సేవలందిస్తుందని తెలిపారు. రాబోయే రోజుల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నెల్లూరు నగర నియోజకవర్గంలో మరిన్ని చలివేంద్రాలు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ వృత్తిలో సర్వేపల్లి పేరు గడించారు

● జనసేన పార్టీ నాయకులు బొబ్బేపల్లి

**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** ఉపాధ్యాయ వృత్తిలో సర్వేపల్లి రాధాకృష్ణన్ పేరు గడించారని జనసేన నాయకులు బొబ్బేపల్లి సురేష్ బాబు అన్నారు. గురువారం ముత్తుకూరులో ఆయన వర్ధంతి కార్యక్రమాన్ని జనసేన పార్టీ నిర్వహించింది. ఈ సందర్భంగా రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేశారు. వీర మహిళ భవాని నాయుడుతోపాటు రెండు మండలాల జన సైనికులు కార్యక్రమానికి విచ్చేసినారు. సందర్భంగా జనసేన నాయకులు బొబ్బేపల్లి మాట్లాడారు. సర్వేపల్లిలో ఆయన విగ్రహాన్ని నెలకొల్పుతామని అన్నారు. కార్యక్రమంలో స్థానికులు తదితరులు పాల్గొన్నారు.



# అగ్ని, జలప్రమాదాల పట్ల అందరూ జాగ్రత్తలు పాటించాలి

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** అగ్నిప్రమాదాలు, జలప్రమాదాలు పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని, తగు జాగ్రత్తలు పాటించాలని ఆత్మకూరు ఇన్‌ఛార్జ్ అగ్నిమాపకాధికారి కె.శ్రీనివాసరావు కోరారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా గురువారం ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని ప్రగతి ఇంగ్లీష్‌మీడియం ఉన్నత పాఠశాలలో అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. అగ్ని ప్రమాదాలు, పాటించాల్సిన, తీసుకో వాల్సిన జాగ్రత్తలను వారు ప్రయోగాత్మకంగా విద్యార్థులకు వివరించారు. ఈసందర్భంగా అగ్నిమాపకాధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ పూర్తిగా ఎండిన గడ్డినిమాత్రమే వాములుగా వేయాలని, గడ్డివాములను నివాసగృహాలకు తప్పకుండా 60అడుగుల దూరం ఉండేలా వేసుకోవాలని, గుడిసెల మధ్యన కనీస దూరం పాటించాలని, బహిరంగమంటలను అనుమతించరాదని, ఆ మండల నుండి నిప్పురవ్వలు ఎగిసిపడి సమీపంలో అగ్నిప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందని, వంటపొయ్యివద్ద వంటచెరుకు నిల్వ ఉంచరాదని పేర్కొన్నారు. వంటపొయ్యిని వినియోగించనవెంటనే నిప్పులను ఆర్పివేయాలని పూరిగుడిసెల్లో కిరోసిన్ దీపాలను తగినంత రక్షణతో వినియోగించుకోవాలని, గుడిసెల్లో విద్యుత్‌వైర్ల జాయింట్లు లేకుండా చూసుకోవాలని, విద్యుత్‌వైర్ల క్రింద గడ్డివాములు వేయరాదని, ఎండుగడ్డిని వాహనాల్లో తరలించే సమయంలో విద్యుత్‌వైర్లు తగలకుండేలా వేసుకోవాలని,



నివాసగృహాల్లో కిరోసిన్, డీజిల్, పెట్రోల్‌ను రక్షణలేకుండా నిల్వ ఉంచరాదని, అగ్నిప్రమాదాలు జరుగకుండేలా తగు జాగ్రత్తలు పాటించాలని, ప్రమాదాలు జరిగిన వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారమివ్వాలని, ఇలాంటి సంఘటనల గురించి విద్యార్థులకు తమ తల్లిదండ్రులకు వివరించడంతోపాటు తాము కూడా అప్రమత్తంగా ఉండాలని శ్రీనివాసరావు కోరారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ ఎస్.రామ్మోహన్‌రెడ్డి, డైరెక్టర్ అమరావతి, అగ్నిమాపక సిబ్బంది సుధాకర్‌రావు, రాజేంద్ర, రబ్బాని, ఇమ్మానియేల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## పౌష్టికాహారంపట్ల చైతన్యం ప్రయోజనకరం

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** పౌష్టికాహారం విషయంలో గర్భిణీలు,బాలింతలు తగిన అవగాహన పెంపొందించుకోవాలని, చైతన్యవంతులైతే అత్యంత ప్రయోజనకరమని ఆత్మకూరు ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఎన్.కేశవ నారాయణమ్మ పేర్కొన్నారు. గురువారం ఐసిడిఎస్ సిడిపివో పి.సునీలత పర్యవేక్షణలో పోషణ్‌పక్వాడ్ కార్యక్రమంలో భాగంగా పౌష్టికాహారపక్షోత్సవాల అవగాహనా సదస్సును ఆత్మకూరు మండలం బోయలచిరువెళ్ళ ఎస్‌సికాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో సూపర్‌వైజర్ నారాయణమ్మ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పౌష్టికాహార సదస్సును ఏర్పాటు చేశారు. సదస్సులో నారాయణమ్మ ప్రసంగిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు, పౌష్టికాహార పక్షోత్సవాలను నిర్వహిస్తున్నామని, అంగన్‌వాడీ కార్యకర్తలు ద్వారా పౌష్టికాహార ప్రదర్శనలు, ర్యాలీలు, శ్రీమంతం, అన్నప్రాసన కార్యక్రమాలు తదితరాలన్నింటిని నిర్వహిస్తూ గర్భిణీలకు, బాలింతలకు పౌష్టికాహారం పట్ల అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. గర్భిణీలు, బాలింతలు కూడా తాము ముమ్మరంగా నిర్వహించే కార్యక్రమాల సారాంశం ప్రకారం పౌష్టికాహారం ఆవశ్యకత, ప్రయోజనాలు గురించి తగు పరిజ్ఞానం పొందాలని, తప్పకుండా పోషకవిలువల ఆహారాన్ని తీసుకోవాలని ఆమె కోరారు. గర్భిణీలు పౌష్టికాహారం సక్రమంగా తీసుకుంటే బాలింత, తల్లీ,బిడ్డా అత్యంత ఆరోగ్యవంతంగా ఉంటారని, రక్తహీనతకు గురికాకుండా ఉండగలరని పేర్కొన్నారు. తమకు అందుబాటులో లభించే పోషకవిలువల ఆహారపదార్థాలను నిర్లక్ష్యం చేయకుండా భుజించాలని నారాయణమ్మ కోరారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని కళావతి, సహోపాధ్యాయిని సునీతలు ప్రసంగించగా ఏఎన్ఎం లీలావతి, సచివాలయ వెల్ఫేర్‌అసిస్టెంట్ సుబ్బారావు, ఆశా కార్యకర్త ఉషా, అంగన్‌వాడీ కార్యకర్తలు దేవసేనమ్మ, దొరసానమ్మ, కృష్ణకుమారి, పలువురు గర్భిణీలు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

# కళాకారుల సంక్షేమానికి చర్యలు తీసుకోవాలి

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** రంగస్థల, జానపద, పండరిభజనల, తోలుబొమ్మలాటల, వీధిభాగవతంల కళాకారుల సంక్షేమాన్ని గత ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని, రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన తెలుగుదేశం ప్రభుత్వమైనా తగు చర్యలు తీసుకోవాలని ఆత్మకూరు ప్రాంతంలోని కళాకారుల సంఘాల ప్రతినిధులు కోరుతున్నారు. గత ప్రభుత్వం వద్ద ఎంతగా మొరపెట్టుకున్నా వృద్ధకళాకారులకు పెన్షన్లు, ఆర్టీసీబస్సుల్లో రాయితీ, కళాకారులకు గుర్తింపుకార్డుల మంజూరు, దేవాలయాల్లో, ఆధ్యాత్మిక కేంద్రాల్లో ప్రదర్శనలకు అవకాశం ఇవ్వకపోగా రంగస్థల వృత్తికళాకారులకు బ్రతుకుదెరువుగా ఉన్న చింతామణి నాటక ప్రదర్శనను నిషేధించారని వారు ఆవేదనతో తెలిపారు. గతంలో 15సంవత్సరాల క్రితం నెల్లూరు జిల్లాలో 560మందికి మాత్రమే వృద్ధకళాకారుల పెన్షన్ మంజూరు చేశారని, అనంతరం ఎంతగా మొరపెట్టుకున్నా 60సంవత్సరాలు దాటిన అర్హులు వందలాదిమంది ఉన్నా వారికి పెన్షన్ మంజూరు చేయలేదన్నారు. చింతామణినాటక ప్రదర్శనపై విధించిన నిషేధం రద్దుచేయాలని అరిచి గీపెట్టినా గత ప్రభుత్వం ఏమాత్రం పట్టిచుకోనకుండా పెడచెవిన పెట్టిందన్నారు. కళాకారులకు గుర్తింపుకార్డులంటూ దరఖాస్తున్న స్వీకరించిన గత ప్రభుత్వం కార్డులివ్వనేలేదన్నారు. వయసుమీరిన అర్హులైన కళాకారులకు పెన్షన్లు మంజూరు చేయాలన్నా జిల్లా పౌరసంబంధాల శాఖకు దరఖాస్తులు చేసే అవకాశం కూడా గత ప్రభుత్వం ఇవ్వలేదని వారు ఆవేదనతో తెలిపారు. గుర్తింపు కార్డులుంటే ఏదేని ప్రదర్శనలకు వెళ్ళే సమయంలో ఎవరూ అడ్డుకొనకుండా ఉంటుందని భావించినా ఆకార్డులు ఇవ్వలేదన్నారు. ప్రదర్శనలకోసం వివిధ ప్రాంతాలకు ప్రయాణాలు చేయాల్సి ఉన్నందున ఆర్టీసీ బస్సుల్లో రాయితీ ఇవ్వాలని కూడా కోరినా పట్టించు కోలేదన్నారు. ఎలాంటి ఆంక్షలు లేకుండా కళాకారుల వృత్తి ప్రాధాన్యతగా అర్హులందరికీ పెన్షన్లు మంజూరు చేయాలని, అందరు కళాకారులకు గుర్తింపు కార్డులివ్వాలని, ఆర్టీసీ బస్సుల్లో రాయితీ ఇవ్వాలని, కళాప్రదర్శనలే వృత్తిగా నమ్ముకొని సరైన అవకాశాలు లేక ఇబ్బందిపడుతున్నందున కళా కారుల ప్రదర్శనలకు దేవాలయాలు, ధార్మికసంస్థల్లో అవకాశం కల్పిం చాలని వారు నేటి ప్రభుత్వాన్ని కోరుతున్నారు. తామూ ప్రజలమేనని, ఓటర్ల మేనని, తాము కూడా ప్రజాప్రతినిధులను ఎన్నుకున్నామని, అన్నివర్గాల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలుచేస్తున్న ప్రభుత్వం కళాకారులను కూడా ఆదుకోవాలని, తమ సంక్షేమానికి చర్యలు తీసుకోవాలని వారంతా కోరుతున్నారు.

## ఆత్మకూరులో కొత్తవిద్యుత్‌తీగలు ఏర్పాటు

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు పట్టణంలోని బివిఎస్ఆర్‌సెంటర్‌నుండి హిల్‌రోడ్డుపై ఉన్న విద్యుత్‌తీగలు చాలాకాలం క్రితం వేసి కాలంతీరడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నందున వాటిస్థానే కొత్త తీగలను గురువారం ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. అక్కడ విద్యుత్‌తీగల పరిస్థితిని గమనించిన పట్టణ ఏయి షేక్ జమీలాబేగమ్ వెంటనే ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళి తగిన అనుమతి



పొంది పాత తీగలను మార్చి కొత్త తీగలను ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. ఈమేరకు గురువారం తీగల మార్పే కార్యక్రమాన్ని ఆమె స్వయంగా దగ్గరుండి పర్యవేక్షించారు. గతంలో ఈ తీగల వలన గాలి,వాన సమయంలో ప్రమాదాలు జరగడం, తాత్కాలిక మరమ్మత్తులు గావించడం జరుగుతుండేది. కాగా ఏయి జమీలాబేగమ్ ప్రత్యేకంగా చొరవతీసుకొని ప్రమాదాలను పసిగట్టి నూతన వైర్లను ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. ఆమె తీసుకున్న నిర్ణయంతో ఈ ప్రాంతప్రజలు హర్షం వ్యక్తం చేయడంతోపాటు ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు.

# విద్యార్థి జీవితాన్ని మలిచేది గురువే

**▶ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ వర్ధంతి**

**వింజమూరు, మేజర్‌న్యూస్ :** విద్యార్థి జీవితాన్ని మలిచేది గురువే అని ఓ గురువు చెప్పిన మాటగురువు లక్ష్యం సంపాదన కాదు, కాకూడదు! నిస్వార్థంగా ఉంటూ.. వివేకవంతమైన, నాణ్యమైన విద్యని విద్యార్థులకు అందజేసేవాడే నిజమైన గురువు! అలాంటి గురుదేవోభవ 'సర్వేపల్లి రాధాకృష్ణన్' అన్నదానం మనిషి ఆకలిని తీర్చితే, అక్షరదానం మనిషి అజ్ఞానాన్ని తొలగిస్తుందని గ్రహించి, ఉపాధ్యాయ వృత్తిని దైవంగా భావించి, జాతి భవితను నిర్మించేందుకు, దేశ యువతకి మార్గనిర్దేశం అయ్యేందుకు ఆధారమైన అనుసంధాన కర్త 'డాక్టర్ సర్వేపల్లిరాధాకృష్ణన్ చీమని చూసి క్రమశిక్షణ, నేలని చూసి ఓర్పు, చెట్టుని చూసి ఎదుగుదల, మంచి ఉపాధ్యాయుణ్ణి చూసి సుగుణాలు నేర్చుకోవాలన్నారు సర్వేపల్లి రాధాకృష్ణన్. అందుకే ఓర్పుతో, క్రమశిక్షణతో ఎదిగారు! దేశ విద్యా వ్యవస్థకే ఆదర్శమయ్యారు! సమర్థులే ఎప్పుడూ నాయకత్వం వహించాలని, అప్పుడే అందరికీ మార్గదర్శకులు అవుతారని చెప్పిన సర్వేపల్లి, నెహ్రూ కోరికని మన్నించి భారత దేశానికి మొట్టమొదటి ఉప రాష్ట్రపతిగానూ, ఆతర్వాత రెండవ రాష్ట్రపతిగానూ ఎన్నికై దేశానికే గర్వకారణం అయ్యారు. అధికార వ్యామోహం ప్రమాదకరమని తెలుసుకున్న సర్వేపల్లి, రాష్ట్రపతి స్థాయిలో ఉన్నా సరే ఎప్పుడూ 'అధికార దర్పణాన్ని' ప్రదర్శించలేదు! అందుకే 'భారతరత్న' బిరుదాంకితులు అయ్యారు! శాంతంగా, సంతోషంగా ఉండేవారే ఆరోగ్యంగా జీవిస్తారని నిరూపించిన 'ఆరోగ్యవంతమైన ఉపాధ్యాయుడు' సర్వేపల్లి జీవితంలో కోట్లు సంపాదించినా కలగని ఆనందం, ఓ మంచి మిత్రుడిని పొందినప్పుడు కలుగుతుందని స్నేహపూర్వక తత్వాన్ని పంచిన ఓ మంచి మిత్రుడు సర్వేపల్లి రాధాకృష్ణన్ తత్వమే జీవితాన్ని అర్థం చేసుకోవడానికి అసలైన మార్గమని, తాత్విక చింతన వైపు అడుగులేసి 'తత్వవేత్త' అయ్యారు సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉపాధ్యాయ వృత్తికి గొప్ప గౌరవం తెచ్చినందుకు ఈయన జన్మదినాన్ని 'ఉపాధ్యాయ దినోత్సవం'గా జరపడం మనదేశం చేసుకున్న అదృష్టం! ఎంత డబ్బైనా సంపాదించే అవకాశమున్నా, సంపాదన వెనుక ఎన్నడూ పరిగెత్తలేదు! విరాష్ట్రపతి అయ్యాక కూడా.. తనకు వచ్చే జీతంలో 25 శాతమే తీసుకుని, మిగతా సొమ్ముని ప్రధానమంత్రి సహాయ నిధికి అందజేసిన నిజమైన మానవత్వమున్న ఉపాధ్యాయుడు 'సర్వేపల్లి రాధాకృష్ణన్'

**కే.రామయ్య, తెలుగుఉపాధ్యాయులు**

## పాఠశాలల్లో విద్యార్థుల నమోదుకు యుటిఎఫ్ ప్రత్యేక కార్యక్రమం



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ప్రభుత్వ పాఠశాలల్లో బడిఈడు చిన్నారులను చేర్పించేలా అవగాహన కల్పించడంతోపాటు నమోదు చేసుకునేలా యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఆత్మకూరులో గురువారం ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే చిన్నారులు చేరాలని, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలన్న సంకల్పంతో యుటిఎఫ్ ఈనిర్ణయం తీసుకొని పట్టణంలోని వెస్ట్‌మాడల్‌స్కూల్, వందురుగుంట మాడల్ స్కూల్ తదితర ప్రాంతాల్లో యుటిఎఫ్ నాయకులు ముమ్మరంగా ఇంటింటా పర్యటించారు. బడిఈడు చిన్నారులున్న ప్రతి ఇంట్లో తల్లిదండ్రులను కలిసి తమ బిడ్డలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో తగినంతగా మౌలికవసతులు, అర్హత,అనుభవం కలిగిన ఉపాధ్యాయులు ఉంటారని, పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్నం భోజనం, యూనిఫారం దుస్తులు తదితరాలన్నీ ఉచితంగా ప్రభుత్వం సమకూరుస్తుందని వారు ప్రజలకు వివరిస్తూ ఈమేరకు వివరాలతోకూడిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు ఎం.గంగాధర్, బి.శివప్రసాద్‌రావు, హెచ్.హరికృష్ణ, హెచ్.మురళీకృష్ణ, షేక్ ఖాదర్‌బాషా, సత్తార్‌సాహెబ్, మస్తాన్‌షరీఫ్, కాలేషా, సి.ఎస్.మస్తాన్, అబ్దుల్‌కలామ్, అంగన్‌వాడీ కార్యకర్త కె.రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఆగిన ఇంటింటికి రేషన్ బియ్యం పంపిణీ వాహనం

- రేషన్ డీలర్ నిర్లక్ష్యం, ఇబ్బంది పడుతున్న ప్రజలు
- వాహనంపై మాజీ సీఎం చిత్రాలు కూడా తొలగించని దృశ్యం
- రేషన్ డీలర్‌కు నచ్చినపుడు లబ్ధిదారుకురేషన్ బియ్యం పంపిణీ
- న్యాయం చేయాలంటూ ప్రజలు తహశీల్దారుకి విన్నపం



**ఇందుకూరుపేట, మేజర్‌న్యూస్ :** కోవూరు నియోజకవర్గం ఇందుకూరుపేట బిట్– 2 పరిధిలో రేషన్ డీలర్ నెల మొదటి తేది నుండి 15వ తేది వరకు రేషన్ బియ్యం లబ్ధిదారులకు పంపిణీ చేయకపోవడంతో పాటు ఎటువంటి అనుమతులు లేకుండా గత కొన్ని నెలల నుండి రేడియోధార్మిక కేంద్రం నందు రేషన్ సరుకులు నిలువ ఉంచి లబ్ధిదారులకు, డీలర్‌కు నచ్చినప్పుడు మాత్రం పంపిణీ చేయడం వల్ల స్థానికంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్టు ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉంటే కూటమి ప్రభుత్వం ఏర్పడి దాదాపు పది నెలలు కావస్తున్న రేషన్ వాహనంపై మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఫోటోలు తొలగించుకోక పోవడం ఇక్కడ విశేషంగా చెప్పకనే చెప్పుకోవచ్చును. దీనిపై సంబంధిత శాఖ అధికారులు డీలర్ పై విచారణ జరిపి, లైసెన్సు రద్దు చేయాలని, రేషన్ బియ్యం అందరికి అందేలే చేయాలని స్థానికంగా ఉండే ప్రజలు ఈ విషయంపై గురువారం ఇందుకూరు పేట తహసీల్దార్ కృష్ణ ప్రసాద్‌కి వినతిపత్రం అందజేశారు.

# పౌష్టికాహారం అత్యంత ప్రయోజనకరం





**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహారం పరమశ్రేష్టమని, అందరూ తగిన అవగాహనతో పోషకవిలువల ఆహారం తీసుకోవాలని ఆత్మకూరు ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఎన్.నాగేశ్వమ్మ పేర్కొన్నారు. గురువారం సిడిపివో సునీలత పర్యవేక్షణలో సూపర్‌వైజర్ నాగేశ్వరమ్మ ఆధ్వర్యంలో ఆత్మకూరు మండలంలోని అప్పారావుపాళెం మెయిన్ అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా పౌష్టికాహార ప్రదర్శన ఏర్పాటు చేశారు. అనంతరం జరిగిన సదస్సులో ఆమె ప్రసంగించారు. పౌష్టికాహారం గర్భిణీలు, బాలింతలకు అత్యంతావశ్యకమని, అందుకే ప్రభుత్వం పౌష్టికాహారం, పాలు, కోడిగ్రుడ్లు, బాలామృతం తదితరాలను అందిస్తుందని తెలిపారు. దాంతోపాటు తమకు అందుబాటులో లభించే వివిద పోషకవిలువల ఆహారాన్ని కూడా తీసుకోవాలని, తద్వారా ఆరోగ్యవంతంగా ఉంటారని, రక్తహీనత సమస్య తలెత్తబోదని నాగేశ్వరమ్మ పేర్కొన్నారు. ఈఅంశాలపట్ల అందరికీ అవగాహన కల్పించాలన్న లక్ష్యంగా పౌష్టికాహార పక్షోత్సవాలను నిర్వహిస్తున్నామని, గర్భిణీలు, బాలింతలు తప్పకుండా అవగాహన పెంపొందించుకోవాలని, పౌష్టికాహారం తప్పకుండా తీసుకోవాలని కోరారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారాలను లబ్దిదారులే తప్పకుండా వినియోగించుకోవాలని ఆమె కోరారు. పౌష్టికాహార ఆవశ్యకత, అందుబాటులో లభించే పోషకవిలువల ఆహారం తదితరాలను వివరించారు. ఈసందర్భంగా గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు వి.శ్రీజ్యోతి, ఎన్.విజయరాణి, డి.వరలక్ష్మి, పలువురు గర్భిణీలు, బాలింతలు,మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

## పన్నులు నూరు శాతం వసూలు చేయాలి



**బోగోలు, మేజర్‌న్యూస్ :** బోగోలు మండలంలో వేగవంతంగా పన్నులు వసూలు నూరు శాతం వసూలు చేయాలని డిపిఓ శ్రీధర్ రెడ్డి అన్నారు. గురువారం బోగోలు మండల పరిషత్ కార్యాలయంలో పంచాయితీ అధికారులతో ఏర్పాటు సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన డిపిఓ శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ.. బోగోలు మండలంలో 80 శాతం వసూలను సాధించడం జరిగిందని మిగిలిన వసూళ్లను త్వరగతిన పూర్తి చేయాలని కోరారు. అదేవిధంగా జిల్లాలో మొత్తం 737 పంచాయతీల గాను, 456 సంపద కేంద్రాలు ఉన్నాయని, నిరుపయోగంగా ఉన్న చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. చెత్త నుండి తయారీ సంపాద కేంద్రాల మరమ్మతుకు 15వ ఆర్థిక సంఘం నిధులను వినియోగించడం జరుగుతుందని తెలిపారు. బోగోలు మండలంలో మొత్తం 13 చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. బోగోలు మండలంలో ఐదు పంచాయతీలను పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేయడం జరిగిందని, వారంలో రెండు రోజులు తడి చెత్త పొడి చెత్తను సేకరించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎల్పిఓ రాధా మాధవి లత ఎంపీడీవో ఈవోపీఆర్డి పంచాయతీ సెక్రెటరీలో పాల్గొన్నారు.

## పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ

**బోగోలు, మేజర్‌న్యూస్ :** బోగోలు మండలం నాగులవరం పంచాయతీ సెక్రెటరీగా విధులు నిర్వహిస్తున్న మార్పుడి భాస్కర్ విధులు పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ప్రజల వద్ద అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నాడని పలు ఆరోపణలు ఉండగా వాటిపై విచారణకు ఆదేశించిన అధికారులు విచారణ చేపట్టి ఆరోపణలు రుజువు కావడంతో భాస్కర్ ను సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

## మూడవ అదనపు జిల్లా జడ్జిగా సోమశేఖర్

- 1వ అదనపు జిల్లా జడ్జిగా గీత

**నెల్లూరు లీగల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు 8వ అదనపు జిల్లా జడ్జి జి.గీతను నెల్లూరు మొదటి అదనపు జిల్లా జడ్జిగా బదిలీ చేస్తూ రాష్ట్ర హైకోర్టు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే పశ్చిమగోదావరి జిల్లా భీమవరం 3వ అదనపు జిల్లా జడ్జిగా పనిచేస్తున్న ఎంఏ సోమశేఖర్‌ను నెల్లూరు 8వ అదనపు జిల్లా జడ్జిగా బదిలీ చేశారు. ఈమేరకు రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.

## గర్భిణీలు,బాలింతలు పౌష్టికాహారంపట్ల అవగాహన పెంపొందించుకోవాలి



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహారం అత్యంత ప్రయోజనకరం, అనివార్యమని, అందరూ అవగాహన పెంపొందించుకోవాలని ఆత్మకూరు ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఎం.రత్నమ్మలు కోరారు. గురువారం ఆత్మకూరు పట్టణంలోని వెస్ట్‌ముస్లింఏరియా అంగన్‌వాడీ కేంద్రంలో సిడిపివో సునీలత పర్యవేక్షణలో సూపర్‌వైజర్ రత్నమ్మ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు నిర్వహించిన పౌష్టికాహార పక్షోత్సవాల అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. పోషణ్‌పక్వాడ్ కార్యమ్రంలో భాగంగా పౌష్టికాహార పక్షత్సవాలను నిర్వహిస్తుండగా ఏర్పాటు చేసిన సదస్సులో రత్నమ్మ ప్రసంగించారు. పౌష్టికాహారం గర్భిణీలు, బాలింతలకు అత్యంతావశ్యకమని, అందుకే ప్రభుత్వం పౌష్టికాహారం, పాలు, కోడిగ్రుడ్లు, బాలామృతం తదితరాలను అందిస్తుందని తెలిపారు. దాంతోపాటు తమకు అందుబాటులో లభించే వివిద పోషకవిలువల ఆహారాన్ని కూడా తీసుకోవాలని, తద్వారా ఆరోగ్యవంతంగా ఉంటారని, రక్తహీనత సమస్య తలెత్తబోదని రత్నమ్మ పేర్కొన్నారు. ఈఅంశాలపట్ల అందరికీ అవగాహన కల్పించాలన్న లక్ష్యంగా అవగాహనా సదస్సులు నిర్వహిస్తున్నామని, గర్భిణీలు, బాలింతలు తప్పకుండా అవగాహన పెంపొందించుకోవాలని, పౌష్టికాహారం తప్పకుండా తీసుకోవాలని ఆమె కోరారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారాలను లబ్దిదారులే తప్పకుండా వినియోగించుకోవాలని రత్నమ్మలు కోరారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు హమీదున్నీసా, సాలిహా, నారాయణమ్మ, సహాయకులు వెంకటరత్నమ్మ, హుమ్రా, షర్మిలా, పలువురు గర్భిణీలు, బాలింతలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్‌కార్యాలయం ఎదుట మజ్జిగ, మంచినీటి చలివేంద్ర




**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు పట్టణంలోని విద్యుత్‌శాఖా కార్యాలయం ఎదుట యునైటెడ్ ఎలక్ట్రికల్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో మజ్జిగ, మంచి నీటి చలివేంద్రను గురువారం ప్రారంభించారు. నిత్యం కార్యాలయానికి వచ్చే వినియోగదారులు, సిబ్బంది తదితరుల సౌకర్యార్థం ఈ ఏర్పాటు చేశామని యూనియన్ నాయకులు పేర్కొన్నారు. ఎండలు తీవ్రంగా ఉన్నందున ప్రజల దాహార్తి తీర్చాలన్న లక్ష్యంగా ఈ చలివేంద్రను ప్రారంభించామని, వేసవి కాలం పూర్తయ్యేవరకు కొనసాగిస్తామని వారు తెలిపారు. తమ యూనియన్ విద్యుత్ సిబ్బంది, కార్మికుల సంక్షేమం, సమస్యలపరిష్కారం, హక్కుల పరిరక్షణ, న్యాయమైన కోర్కెల సాధనకు కృషి చేస్తుండడంతోపాటు సామాజికసేవాకార్యక్రమాలు నిర్వహిస్తుంటామని, అందులో భాగంగా ఈ మండుటెండల్లో నిత్యం అధికంగా కార్యాలయానికి వచ్చే వినియోగదారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రను ఏర్పాటు చేశామని, వినియోగదారుల సౌకర్యార్థం ఇటీవలనే కార్యాలయం ఎదుట చలువపందిరి కూడా ఏర్పాటు చేశామని వారు పేర్కొన్నారు. ఈకార్యక్రమానికి అతిథులుగా విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసులు, డిప్యుటి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.చిన్నస్వామినాయక్, డివిజన్‌లోని ఏయిలు హాజరయ్యారు. ఈకార్యక్రమంలో యుఈఈయు నాయకులు జి.వి.శివప్రసాద్, కె.హజరత్తయ్య, షేక్ మస్తాన్, ఎస్.విజయరామిరెడ్డి, లక్ష్మినరశింహారెడ్డి, ఎం.ప్రతాప్‌రెడ్డి, సిహెచ్ ఓంకారం, ఎల్ఐ బ్రహ్మానందం, బిఎస్‌పి యూనియన్ నాయకుడు కొండలరావు, బిఎంఎస్ నాయకుడు నాగులపాటి శివారెడ్డి, టిఎన్‌టియుసి నాయకుడు శ్రీనివాసరెడ్డి, వైఎస్ఆర్‌యూనియన్ నాయకుడు పద్మారెడ్డి, పలువురు నాయకులు, కార్యకర్తలు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# ఉమ్మడి ఆస్తి ఒకరికి ఎలా వర్తిస్తుంది

- విచారణ లేకుండ ఒకరు పైనే భూమిని ఆన్‌లైన్‌లో ఎలా ఎక్కిస్తారు
- గతంలో తహసిల్దార్ చేసిన పని వలన అన్నదమ్ముల మధ్య ఘర్షణ



**సైదాపురం, మేజర్‌న్యూస్ :** శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా సైదాపురం మండలంలోని పాలూరు గ్రామ సర్వేనెంబరు 441ఉన్న ఎకరా 66 సెంట్లు భూమి తిరుపతి జిల్లా గూడూరు రూరల్ మండలం నెన్నూరు గ్రామంకు చెందిన సురాబత్తిన రామయ్యకి సంబందించింది ఆభూమిని సురాబత్తిన రయ్యత్న కుమారులు సురాబత్తిన శ్రీనువాసులు, సురాబత్తిన నాగార్జునలపై గతంలో పనిచేసిన తహసీల్దార్ టి.ప్రవీణ్ కుమార్ ఎలా ఆన్‌లైన్లో వన్..బి ఎలా ఎక్కిస్తారు, ఆరు మంది కుమారులకు రావాల్సిన భూమి ఒక్క కుమారుడు సురబత్తిన రత్నయ్య కుమారులు ఎలా చేస్తారని గురువారం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మాతండ్రి రామయ్యకి 7మంది కుమారులు పెద్ద కుమారుడుకు సంబందించిన కుమారులపై ఏవిదంగా ఉమ్మడి అస్తిని చేస్తారని ఆరోపించారు. సమాచారం ఇవ్వకుండా తహసీల్దార్ ఆన్ లైన్‌లో భుమిని మార్చిరాని చెప్పారు. ఆన్‌లైన్‌లో వన్.. బిలు తోలగించకపోతే జిల్లా అధికారులు దృష్టికి మా సమస్యను తీసుకెళ్లడం జరుగుతుందని బాధితులు తెలిపారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ ఆశాజ్యోతికి వినతపత్రం అందజేశారు.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** మర్రిపాడు మండలం బాట గ్రామ సమీపంలో జాతీయ రహదారి 567పై రోడ్డు ప్రమాదం జరిగి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు నల్లిపోగు చెన్నయ్య (55) రోడ్డు దాటే సమయంలో వేగంగా వస్తున్న బొలెరో వాహనం బలంగా ఢీకొనడంతో బాధితుడు అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. స్థానికులు పోలీసులకు సమాచారం తెలియజేయడంతో ఘటన ప్రదేశానికి చేరుకున్న ఎస్ఐ శ్రీనివాసరావు ప్రమాదానికి గల కారణాలను తెలుసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామన్నారు. ప్రమాదానికి కారణమైన బొలెరో వాహనాన్ని బ్రాహ్మణపల్లి టోల్ ప్లాజా వద్ద పట్టుకోవడం జరిగిందని ఎస్ఐ శ్రీనివాసరావు అన్నారు. ప్రమాదంలో మృతి చెందిన నల్లిపోగు చెన్నయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## బడి ఈడు చిన్నారులను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలి

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మండలంలోని బిజ్జం పల్లె జడ్పీ ఉన్నత పాఠశాల పరిధిలోని గ్రామాల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించి పాఠశాలలను బలోపేతం చేసుకోవాలని ఉన్నత పాఠశాల హెచ్ఎం షేక్ నాయక్ పేర్కొన్నారు. ఆయన గురువారం ఉన్నత పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులతో కలిసిఅన్నం పల్లి, కొత్తపల్లి, బిజ్జంపల్లి, లింగమనేనిపల్లి గ్రామాల్లో ఇంటింటికి తిరిగి విద్యార్థుల నూతన నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన తల్లిదండ్రులతో మాట్లాడుతూ.. పిల్లలను మా పాఠశాలలో చేర్పించండి, మీ పిల్లలను మా పిల్లలుగా భావించి హామీతో కూడిన నాణ్యమైన విద్యను మేము అందిస్తాము. ఉచిత వ్యాన్ సౌకర్యం కూడా కల్పిస్తాము. మా పాఠశాల యందు అన్ని వసతులు ఉన్నాయన్నారు. అనంతరం నూతన నమోదు కొరకు కరపత్రాలను విద్యార్థుల తల్లిదండ్రులకు అందించారు.



# వైసీపీ నాయకులు ఆర్ఎస్ఆర్ తల్లిని పరామర్శించిన ఆనం



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** వైసీపీ నెల్లూరు జిల్లా అధికార ప్రతినిధి రావు శ్రీనివాసరావు (ఆర్ఎస్ఆర్) తల్లిని నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని జిల్లా అధికార ప్రతినిధి రావు శ్రీనివాస్ రావు (ఆర్ఎస్ఆర్) తల్లికి ఈ మధ్యన చెయ్యి ఫ్యాక్చర్ అయ్యి మేజర్ ఆపరేషన్ చేయించుకుని నెల్లూరులోని రెయిన్బో హాస్పిటల్‌లో చికిత్స పొందుతుండగా ఈ సందర్భంగా వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డి పరామర్శించి వారికి అందుతున్న వైద్యం గురించి వైద్యులతో మాట్లాడటం జరిగింది. అదేవిధంగా వారికి మెరుగైన చికిత్స అందించాలని డాక్టర్లను కోరారు, కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో 37వ డివిజన్ కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాస్ యాదవ్, మాజీ కార్పొరేటర్ నెల్లూరు మదన్ మోహన్ రెడ్డి, స్టేట్ సెక్రటరీ శ్యామ్ సింగ్, జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు చంద్రశేఖర్, జిల్లా సెక్రెటరీ ఆదిరెడ్డి, నెల్లూరు రూరల్ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు రమాదేవి, బూత్ కమిటీ అధ్యక్షుడు సుబ్బారెడ్డి, లక్ష్మీనారాయణ, మురళి యాదవ్, చంద్రారెడ్డి, శేఖర్ రెడ్డి, మద్దా బాబు, హైమావతి, పెంచల రావు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# దళిత గిరిజనులకు భూమి హక్కు కల్పించండి




**సైదాపురం, మేజర్‌న్యూస్ :** సైదాపురం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఊటుకూరు దళితులపై మైనింగ్ మాఫియా పెట్టిన అక్రమ కేసులను, దళితుల అక్రమ గల ప్రభుత్వ భూములకు యాజమాన్యం హక్కు కల్పించాలని భూస్వాముల ఆధీనంలో ఉన్న సర్వేనెంబర్ 356, 359 గల 400 ఎకరముల ప్రభుత్వ భూములను ఆక్రమణలు తొలగించి దళితులకు ఇతర పేదలకు పంచాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కార్యాలయం నుంచి భూమిలేని నిరుపేదలు ఎర్రజెండాలు చేతబోని ప్రదర్శనగా బయలుదేరి సైదాపురం తహసీల్దార్ కార్యాలయం వద్ద రెండో రోజు నిరవధిక ధర్నా కార్యక్రమం కొనసాగించారు. ఆ సందర్భంగా అఖిల భారత రైతు సంఘం జిల్లా అధ్యక్షులు డిపి పోలయ్య మాట్లాడుతూ.. ప్రతిఘటన పోరాటాల ద్వారానే భూస్వాములు ఆధీనులో ఉన్న ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలని పిలుపునిచ్చారు. సైదాపురం తహసీల్దార్ మైనింగ్ మాఫియాకు కొమ్ముగాస్తు వెంకట కృష్ణ మైనింగ్ కంపెనీకి దళితుల ఆధీనంలో 50 ఎకరాల ప్రభుత్వ భూములను ఎటువంటి సర్వే లేకుండా మైనింగ్ మాఫియా అప్పగించడం వల్ల అధికార పార్టీ అండదండలతో దళితులపై మైనింగ్ మాఫియాతో కలిసి పోలీసులు అక్రమ కేసులు బనాయించారు. దీంతో దళితులను తమ ఆధీనంలో భూమిలేని భూమిలోనికి వెళ్లనికుండా పోలీసులు వేధిస్తున్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి దళితులపైన మైనింగ్ మాఫియా అక్రమంగా పెట్టిన కేసులను ఎత్తివేసి దళితులు ఆధీనంలో ఉన్న ప్రభుత్వ భూములకు యాజమాన్య హక్కు కల్పించాలని, భూస్వాముల పెత్తందారుల ఆధీనంలో ఉన్న ప్రభుత్వ భూములను ఆక్రమణ తొలగించి భూములను నిరుపేదలకు పంచాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం ఐఎఫ్టియు జిల్లా అధ్యక్షులు కే రమేష్ మాట్లాడుతూ.. గత రెండు నెలలుగా ఊటుకూరు దళితులు ఆక్రమంలో ఉన్న ప్రభుత్వ భూములకు యాజమాన్య హక్కు కల్పించాలని దళితులపై అక్రమంగా పెట్టిన కేసులను ఎత్తేయాలని ఆందోళన ప్రభుత్వ కార్యాలయం వద్ద ఆందోళన చేసి జిల్లా కలెక్టర్ కి వినత పత్రం అందజేశారు. స్పందించిన జిల్లా కలెక్టర్ ఊటుకూరు గ్రామంలో భూస్వాములు ఆక్రమంలో ఉన్న ప్రభుత్వ బంజరు, భూములను ఆక్రమణలు తొలగించి భూమిని లేని నిరుపేదల జాబితాను భూ పంపిణీ కార్యక్రమానికి తయారు చేయాలని కార్యక్రమానికి తయారుచేయాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేస్తే. కలెక్టర్ ఆదేశాలను సైతం సైదాపురం తాసిల్దార్ అధికార పార్టీ నాయకులు మైనింగ్ మాఫియాకు తొత్తుగా మారి కలెక్టర్ ఆదేశాలు అమలు చేయకుండా, దళితులకు భూమిని దక్కనీకుండా మైనింగ్ మాఫియాకు అప్పగిస్తున్నారు. మరోవైపున దళితులను భూములోకి వెళ్లనికుండా పోలీసులు అడ్డుకుంటున్నారు. మరోవైపున అదే సర్వేనెంబర్‌లో భూస్వాములు ఆక్రమణ చేసి వ్యవసాయం చేస్తుంటే వారికి వ్యవసాయం చేసే అవకాశం కల్పించి, దళితులకు తీవ్రమైన అన్యాయం చేస్తున్నారు. తక్షణమే ఉన్నత అధికారులు స్పందించి ఊటుకూరు గ్రామంలో దళితుల ఆక్రమణ గల ప్రభుత్వ భూములకు యాజమాన్య హక్కు కల్పించి దళితులపై రైతుకూలీ సంఘం నాయకులు పై మహిళా సంఘం నాయకులపై మైనింగ్ మాఫియా అక్రమంగా పెట్టిన కేసులను తక్షణమే వ్యతియాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యులు గద్దం వెంకటేశ్వర్లు, ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా నాయకురాలు బి.మమత నాగమణి వెంకటరమణమ్మ, సంపూర్ణమ్మ, అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు పి.కోటయ్య పి.శ్రీను చంటి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.